తెలుగు దినపత్రిక
RNI TG TEL/ 26/A0381
# సిరి
People's Voice వార్త పత్రిక
24-05-2026
ఆదివారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 109
PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
www.siridaily.com
సిరి
People's Voice వార్తపత్రిక
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
epaper.siridaily.com
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575

# గులాబీ దళం యాక్టివ్!

## 'రూరల్'కు హరీశ్.. 'సిటీ'కి కేటీఆర్

- ఎర్రవెల్లి వేదికగా కేసీఆర్ మాస్టర్ ప్లాన్ షురూ
- గ్రామస్థాయి నుంచి పార్టీ ప్రక్షాళన..
- పల్లె, పట్టణాల్లో పూర్వవైభవం కోసం సరికొత్త వ్యూహం
- ట్రబుల్ షూటర్ హరీశ్ రావుకు రూరల్ జిల్లాల బాధ్యతలు
- హైదరాబాద్, పట్టణాలపై కేటీఆర్ ఫోకస్..
- రూరల్, సిటీ కాంబినేషన్‌తో ప్రత్యర్థులకు చెక్ పెట్టేలా ప్లాన్
- సోషల్ మీడియా దూకుడుకు తోడుగా ఇక క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష పోరు



**ప్రత్యేక ప్రతినిధి, సిరి న్యూస్:**

తెలంగాణ రాజకీయాల్లో ప్రధాన ప్రతిపక్షమైన భారత్ రాష్ట్ర సమితి రాబోయే ఎన్నికలకు సమర శంఖం పూరించింది. గత ఎన్నికల ఫలితాల అనంతరం కొంతకాలం స్తబ్దుగా ఉన్న గులాబీ దళం.. ఇప్పుడు మునుపటి కంటే రెట్టింపు ఉత్సాహంతో, పక్కా యాక్షన్ ప్లాన్‌తో రంగంలోకి దిగుతోంది. ముఖ్యంగా పార్టీకి అత్యంత బలమైన పునాదిగా ఉన్న గ్రామస్థాయి నెట్‌వర్క్‌ను మళ్లీ యాక్టివ్ చేసి, పూర్వవైభవాన్ని తీసుకురావడమే లక్ష్యంగా కసరత్తు షురూ చేసింది. ఇటీవల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన ఎర్రవెల్లి నివాసంలో పార్టీ ముఖ్య నాయకులతో అత్యంత కీలకమైన సమావేశాన్ని ఏర్పాటు చేసి, రాబోయే కాలంలో పార్టీని ఎలా ముందుకు తీసుకెళ్లాలనే దానిపై పక్కా రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేశారు. కేసీఆర్ ఇచ్చిన ఈ దిశానిర్దేశంతో గులాబీ శ్రేణుల్లో సరికొత్త జోష్ నెలకొంది.

మిగతా 2 లో



# లక్షల్లో జీతం.. కోట్లల్లో ఆస్తులు!

- నిస్సిగ్గుగా అవినీతి అధికారులు
- అధికారం అడ్డుపెట్టుకొని సర్కారు భూములను అమ్మేస్తున్న ఘనులు
- ఏసీబీ కేసుల్లో పట్టుబడుతున్న తిమింగలాల వెనుక అసలు కథ
- గడిచిన ఆరు నెలల్లోనే వందకు పైగా కేసులు
- అవినీతి సామ్రాజ్యం విలువ వేల కోట్ల రూపాయలపైనే
- రెవెన్యూ శాఖలో ఇష్టారాజ్యం..

3





# రేపటి నుంచి

## రైతు గోస- బీజేపీ భరోసా

.. వివరాలు 2లో

# వరుసగా మూడోసారి పెట్రో ధరల పెంపు

## పెట్రోల్‌పై 87 పైసలు, డీజిల్ పై 91 పైసల వాయింపు

2



పెట్రోల్ డీజిల్ ధరలు వరుసగా మూడోసారి పెరిగాయి. శనివారం పెట్రోల్‌పై 87 పైసలు, డీజిల్‌పై కేంద్ర ప్రభుత్వం 91 పైసలు పెంచింది. 10 రోజుల్లో ధరలు పెంచటం ఇది మూడోసారి. ధరల పెంపు విషయంలో ఆయిల్ కంపెనీలు ఓ ప్యాట్రన్ ఫాలో అవుతున్నట్లు సోషల్ మీడియాలో చర్చ నడుస్తుంది.

# రైతు డిస్కమ్..

## వ్యవస్థను ముక్కలు చేసే కుట్ర..!

- దేశంలో ఎక్కడా లేని విధంగా కేటగిరీల వారీగా డిస్కమ్ ఏర్పాటు
- జనాల్లో పెరుగుతున్న తీవ్ర వ్యతిరేకత
- రైతు డిస్కమ్‌పై ప్రజాభిప్రాయ సేకరణ చివరి తేదీని మార్చిన ఈఆర్సీ
- తప్పుడు సమాచారంతో జర్నలిస్టులను తప్పదోవ పట్టించే యత్నం
- పేరు లేకుండా అనధికారిక లేఖ విడుదలపై చర్చ.
- బోర్డు లేదు, సబ్‌స్టేషన్లు లేవు..
- పదోన్నతుల పేరుతో తప్పుడు ఆశలు..
- కొత్త డిస్కమ్ ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకిస్తున్న రెండు విద్యుత్ ఉద్యోగ జేఏసీలు
- నిరసనగా నేడు సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో సమావేశం

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకురావాలని భావిస్తున్న 'రైతు డిస్కమ్' (మూడవ డిస్కమ్) ఏర్పాటుపై విద్యుత్ నిపుణులు, ఉద్యోగ సంఘాలు, రైతు ప్రతినిధుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. గత 12 ఏళ్లుగా తెలంగాణలో ఉన్న రెండు డిస్కమ్‌లు వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తుండగా.. ఇప్పుడు సమర్థవంతంగా నడుస్తున్న వ్యవస్థను ముక్కలు చేయడానికి తప్ప, కొత్తగా రైతుకు ఒరిగే ప్రయోజనం ఏమీ లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

మిగతా 2 లో

# ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ వ్యాపారం

**బీఆర్ఎస్ రాగానే ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తాం**

**మాజీ మంత్రి హరీష్ రావు హెచ్చరిక**

3



బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న మాజీ మంత్రి.. కాంగ్రెస్ సర్కార్ చేపడుతున్న ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. ఫార్మా సిటీకి మాత్రమే కేంద్ర పర్యావరణశాఖ అనుమతి ఇచ్చిందని తెలిపారు.

# గోదావరి పుష్కరాలకు వేయికోట్లు



- జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం
- గంగాధర కాలేజీలో పోస్టుల భర్తీకి ఆమోదం
- కేసముద్రం ఫైర్‌స్టేషన్‌కు 18 పోస్టుల మంజూరు
- తెలంగాణ కేబినెట్ కీలక భేటీ నిర్ణయం

**హైదరాబాద్, సిరి న్యూస్:**

వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నేపథ్యంలో.. సంబంధిత పనులకు రూ.వెయ్యి కోట్ల కేటాయిస్తూ తెలంగాణ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. తొలి విడతగా రూ.300 కోట్ల మంజూరుకు పచ్చ జెండా ఊపింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ భేటీలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. జూనియర్ కళా శాలల్లోనూ మధ్యాహ్న భోజనం పథకం అమ లుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అల్పాహారం, పాలు అందించాలని నిర్ణయించింది. అస్సాం రైఫిల్స్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్ సెంటర్ల ఏర్పాటుకు కరీంనగర్ జిల్లాను ఎంపిక చేసింది. కేసముద్రం ఫైర్‌స్టేషన్‌కు 18 పోస్టుల మంజూరుకు అంగీకారం తెలిపింది.

మిగతా 2 లో

# యాదగిరిగుట్టలో సీఎం పర్యటన

## వందకోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

2



# బీఆర్ఎస్ నాయకుడి దారుణ హత్య!

- మాజీ సర్పంచ్ భర్త మధును నరికి చంపిన దుండగులు
- మృతదేహాన్ని ముక్కలు చేసి కాలువలో పడేసిన వైనం
- రాజకీయ కక్షలే కారణమంటున్న స్థానికులు
- నల్లగొండ జిల్లాలో కలకలం
- కాంగ్రెస్ నేతలే పథకం ప్రకారం చంపించారన్న జగదీష్ రెడ్డి

2

నల్లగొండ జిల్లా సూర్యాపేట మండలం యార్కారం గ్రామంలో ఘోర విపత్తు చోటు చేసుకుంది. బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ భర్త, స్థానిక నాయకుడు చింతలపాటి మధు గుర్తు తెలియని దుండగుల చేతిలో దారుణ హత్యకు గురయ్యారు.





# పుష్కరాలకు వేయికోట్లు

మొదటి పేజీ తరువాయి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ కేబినెట్ శనివారం భేటీ అయ్యింది. రాష్ట్రానికి సంబంధించి పలు అంశాలపై మంత్రిమండలి చర్చించింది. ఈ సందర్భంగా కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేసేందుకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పాఠశాలలతో పాటు జూనియర్ కళాశాలల్లోనూ విద్యార్థులకు ఉదయం అల్పాహారం, పాలు అందించాలని మంత్రిమండలి నిర్ణయించింది. 2027 గోదావరి పుష్కరాల పనులకు రూ.1,000 కోట్లు కేటాయిస్తూ తెలంగాణ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. తొలివిడతగా రూ.300 కోట్లు మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మరోవైపు నిరుద్యోగ యువతకూ మంత్రిమండలి గుడ్ న్యూస్ చెప్పింది. కరీంనగర్ జిల్లా గంగాధరలోని డిగ్రీ కళాశాలలో నియామకాలకు పచ్చజెండా ఊపింది. 20 రెగ్యులర్ టీచింగ్ పోస్టులు, 6 నాన్ టీచింగ్ పోస్టులు, అవుట్ సోర్సింగ్ పద్ధతిన మరో 3 పోస్టుల మంజూరుకు ఆమోదం తెలిపింది. మహబూబాబాద్ జిల్లా కె.సముద్రం అగ్నిమాపక కేంద్రానికి సంబంధించి 18 పోస్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

# తొలి ఏఐ ఆధారిత ఫిర్యాదు రికార్డర్

**యాప్ రూపొందించినట్లు సజ్జనార్ వెల్లడి**

**హైదరాబాద్, మే 23:** శాంతిభద్రతల పరిరక్షణలో దేశంలోనే అగ్రగామిగా ఉన్న తెలంగాణ పోలీస్ శాఖ.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో మరో చారిత్రాత్మక అడుగు వేసింది. రాష్ట్ర పోలీస్ వ్యవస్థలో కృత్రిమ మేధస్సు, అత్యంత అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించేందుకు కట్టుదిట్టమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ (డీజీపీ) సీవీ ఆనంద్ అధికారికంగా వెల్లడించారు. సమకాలీన సమాజంలో మారుతున్న నేరాల శైలిని అరికట్టడానికి సాంకేతికతను జోడించడం అత్యంత ఆవశ్యకమని ఆయన స్పష్టం చేశారు. శనివారం డీజీపీ కార్యాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నేర పరిశోధనను మరింత వేగవంతం చేయడానికి, శాంతిభద్రతలను పటిష్టంగా పర్యవేక్షించడానికి, అలాగే ప్రజలకు పారదర్శకమైన సేవలను త్వరితగతిన అందించడంలో ఏఐ సాంకేతికత కీలక పాత్ర పోషించబోతోందని వివరించారు. ఈ నూతన విప్లవాత్మక మార్పులను పర్యవేక్షించేందుకు మరియు క్షేత్రస్థాయిలో అమలు చేయడానికి డీజీపీ కార్యాలయంలో ఒక 'ప్రత్యేక టెక్ టీమ్' (సాంకేతిక బృందం)ను ఏర్పాటు చేసున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ అత్యాధునిక ఏఐ ఆధారిత పోలీసింగ్ కార్యక్రమాలను వేగవంతం చేయడంతో పాటు, ప్రస్తుతం పోలీస్ శాఖలో విడివిడిగా సేవలందిస్తున్న ప్రధాన డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లైన సీసీటీఎన్ఎస్, హెచ్ఆర్ఎమ్ఎస్, ప్రజలకు రక్షణ కల్పించే 'హాక్ఐ' అప్లికేషన్‌ను ఒకే సమగ్రమైన (ఇంటిగ్రేటెడ్) నెట్‌వర్క్ కిందకు తీసుకురావడానికి చురుగ్గా చర్యలు తీసుకుంటున్నట్లు డీజీపీ వెల్లడించారు. దీనివల్ల సమాచార మార్పిడి మరింత సులభతరమై, నేరగాళ్ల గుట్టు రట్టు చేయడం పోలీసులకు మరింత సులువు కానుంది. తెలంగాణ ప్రజలకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మెరుగైన, సురక్షితమైన పోలీసింగ్ సేవలు అందించడమే తమ శాఖ ప్రధాన లక్ష్యమని డీజీపీ పునరుద్ఘాటించారు. రాబోయే భవిష్యత్ సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వీలుగా.. మరింత 'స్మార్ట్', 'ఫాస్ట్' పోలీస్ వ్యవస్థను నిర్మించేందుకు నిరంతరం శ్రమిస్తున్న ఉన్నతాధికారులను, సాంకేతిక బృందాలను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ఈ ఏఐ సాంకేతికత అందుబాటులోకి వస్తే సైబర్ నేరాల నియంత్రణతో పాటు క్షేత్రస్థాయి పోలీసింగ్‌లో విప్లవాత్మక మార్పులు వస్తాయని పోలీస్ వర్గాలు భావిస్తున్నాయి.

# రేపటి నుంచి 'రైతు గోస- బీజేపీ భరోసా'

**హైదరాబాద్, మే 24:** ఈ నెల 25 నుంచి 'రైతు గోస- బీజేపీ భరోసా' పేరిట పోరుబాట నిర్వహించేందుకు భాజపా సిద్ధమవుతోంది. తొలిరోజు తాండూరులో.. రెండో రోజు గజ్వేల్, భువనగిరి, వరంగల్‌లో.. మూడో రోజు భూపాలపల్లి, కాటారం, మంథని, పెద్దపల్లిలో పోరుబాట నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నిరసన తెలపనున్నారు. రైతులతో ముఖాముఖి నిర్వహించనున్నారు. వారి సమస్యలు అడిగి తెలుసుకోనున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనుగోలు కేంద్రాల వద్ద ఉండనున్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆధ్వర్యంలో పోరుబాట కొనసాగనుంది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి అభయ్ పాటిల్ ఇందులో పాల్గొననున్నారు.

# మూడోసారి పెట్రో ధరల పెంపు

**పెట్రోల్‌పై 87 పైసలు, డీజిల్ పై 91 పైసల వాయింపు**

**న్యూఢిల్లీ, మే 24:** పెట్రోల్ డీజిల్ ధరలు వరుసగా మూడోసారి పెరిగాయి. శనివారం పెట్రోల్‌పై 87 పైసలు, డీజిల్ పై కేంద్ర ప్రభుత్వం 91 పైసలు పెంచింది. 10 రోజుల్లో ధరలు పెంచటం ఇది మూడోసారి. పెట్రోల్, డీజిల్ ధరల పెంపు విషయంలో ఆయిల్ కంపెనీలు ఓ ప్యాట్రన్ ఫాలో అవుతున్నట్లు సోషల్ మీడియాలో జోరుగా చర్చ నడుస్తుంది. ఇప్పటి వరకు నాలుగు రోజులకు ఒకసారి పెంచటం జరిగింది. 15వ తేదీ తర్వాత 19.. ఆ తర్వాత 23వ తేదీ.. అంటే ధరల పెంపు మధ్య 4 రోజుల గ్యాప్ ఉండేలా చూసుకుంటున్నారు. ఇదే సమయంలో మరో ఆసక్తికరమైన అంశంపై సోషల్ మీడియాలో చర్చ నడుస్తుంది. గతంలో పెట్రోల్, డీజిల్ ధరల పెంపును రాత్రి టైంలో అనౌన్స్ చేసేవాళ్లు.. రేపటి ఉదయం పత్రికల్లో ఆ వార్త వచ్చేసింది. ఇప్పుడు ఈ విధానం మారింది. అర్ధరాత్రి తర్వాత.. తెల్లవారుజామున ధరల పెంపు ప్రకటన చేస్తున్నారు. ఉదయం ఆరు గంటల సమయంలోనే ఈ వార్త జనానికి తెలుస్తుంది. పెంచిన ధరలు ఈ ఉదయం 6 గంటల నుంచే అమల్లోకి వచ్చాయని ప్రకటిస్తున్నారు. పెట్రోల్, డీజిల్ రేట్లు పెంపు అనేది టీవీల్లో, సోషల్ మీడియాలో చూసి మాత్రమే జనం తెలుసుకుంటున్నారు.

# గులాబీ దళం యాక్టివ్!

మొదటిపేజీ తరువాయి

ఈ నయా యాక్షన్ ప్లాన్‌లో భాగంగా కేసీఆర్ ఒక కీలకమైన, వ్యూహాత్మకమైన నిర్ణయం తీసుకున్నారు. పార్టీలో అత్యంత నమ్మకమైన, క్షేత్రస్థాయిలో తిరుగులేని పట్టున్న 'ట్రబుల్ షూటర్' తన్నీరు హరీశ్ రావుకు రూరల్ జిల్లాల పూర్తి బాధ్యతలను అప్పగించారు. పల్లెల్లో మళ్లీ పార్టీని గాడిన పెట్టేందుకు, కేడర్‌లో భరోసా నింపేందుకు హరీశ్ రావు సరైన నాయకుడని గులాబీ బాస్ భావించారు. దీనితో పాటు, సిటీ జిల్లాల బాధ్యతలను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యవేక్షించనున్నారు. ఇలా 'రూరల్‌కు హరీశ్ – సిటీకి కేటీఆర్' అనే ద్విముఖ వ్యూహంతో తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త ప్రకంపనలు సృష్టించేందుకు బీఆర్ఎస్ సిద్ధమవుతోంది.

**శరవేగంగా డిజిటల్ సభ్యత్వం**

కేసీఆర్ ఆదేశాల ప్రకారం, కేవలం మాటలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పనులు అప్పుడే ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ డిజిటల్ సభ్యత్వాల నమోదు ప్రక్రియ అత్యంత శరవేగంగా సాగుతోంది. ఆధునిక సాంకేతికతను వాడుకుంటూ ప్రతి గ్రామంలో, ప్రతి వార్డులో డిజిటల్ పద్ధతిలో మెంబర్‌షిప్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నారు. దీనికి తోడుగా, త్వరలోనే గ్రామ కమిటీల పునర్వ్యవస్థీకరణ, మండల మరియు జిల్లా స్థాయి కమిటీల ఏర్పాటు జరగబోతోంది. పార్టీ కార్యకర్తలకు, స్థానిక నాయకులకు ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలో వివరించేందుకు ప్రత్యేక శిక్షణ తరగతులను కూడా నిర్వహించనున్నారు. ఈ కమిటీల ఏర్పాటు, శిక్షణ, సభ్యత్వ నమోదు వంటి కీలక బాధ్యతలన్నింటినీ హరీశ్ రావు దగ్గరుండి స్వయంగా పర్యవేక్షించనున్నారు.

**'హరీశ్ రావు' పల్లెబాట!**

హరీశ్ రావుకు రూరల్ జిల్లాల బాధ్యతలు అప్పగించిన నేపథ్యంలో త్వరలోనే విస్తృతంగా పర్యటించనున్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో కీలక సమావేశాలు ఏర్పాటు చేసి, స్థానిక నాయకులతో ముఖాముఖి మాట్లాడి, ఎక్కడెక్కడ లోపాలు ఉన్నాయో వాటిని సరిదిద్దే పనిలో పడనున్నారు. హరీశ్ రావు రంగంలోకి దిగితే క్షేత్రస్థాయి కేడర్‌లో ఉండే ఉత్సాహమే వేరని, ఆయన పర్యటనలతో రూరల్ తెలంగాణలో గులాబీ జెండా మళ్లీ రెపరెపలాడటం ఖాయమని పార్టీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

**సోషల్ మీడియా దూకుడుకు తోడుగా..**

గత కొంతకాలంగా డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లపై కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై బీఆర్ఎస్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తూ వస్తోంది. సోషల్ మీడియాలో ఇప్పటికే అత్యంత యాక్టివ్‌గా ఉంటూ ప్రజా సమస్యలను ఎండగడుతున్న గులాబీ పార్టీ.. ఇకపై కేవలం డిజిటల్ స్పేస్‌కే పరిమితం కాకుండా, నేరుగా ప్రజాక్షేత్రంలోకి దూకాలని నిర్ణయించింది. రైతు సమస్యలు, రుణమాఫీ అమలులో లోపాలు, నిరుద్యోగుల ఇబ్బందులు, స్థానిక సమస్యలపై ప్రజల పక్షాన నిలబడి పెద్ద ఎత్తున ధర్నాలు, ఆందోళన కార్యక్రమాలకు ప్లాన్ చేస్తోంది.

# యాదగిరిగుట్టలో సీఎం పర్యటన

**వందకోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**రూ.43.80 కోట్లతో వేదపాఠశాలకు భూమిపూజ**

**యాదగిరిగుట్ట, మే 23:** యాదగిరిగుట్టలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా రూ.100 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. శనివారం ఉదయం యాదగిరిగుట్టకు చేరుకున్న సీఎం రేవంత్ శ్రీలక్ష్మీనర్సింహ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం రూ.43.80 కోట్లతో నిర్మించనున్న వేద పాఠశాలకు రేవంత్ శంకుస్థాపన చేశారు. కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతితో కలిసి వేదపాఠశాలకు భూమిపూజ చేశారు. అనంతరం రూ.9.87 కోట్లతో కొండపై స్వామివారి నిత్య కల్యాణ మండపం నిర్మాణానికి, రూ.1.41 కోట్లతో వైకుంఠ ద్వారం నుంచి కొండపైకి వెళ్లే మెట్ల మార్గం పై కప్పు నిర్మాణానికి, రూ.1.35 కోట్లతో నిర్మించనున్న రథశాల వైపు మాడవీధులకు మెట్ల నిర్మాణానికి, రూ.43.12 కోట్లతో డార్మిటరీ హాల్స్, దీక్షాపరుల సదన్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఉదయం ప్రత్యేక హెలికాప్టర్లో యాదగిరిగుట్ట పెద్దగుట్టపైకి చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డికి.. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, కలెక్టర్ అనురాగ్ జయంతి ఘన స్వాగతం పలికారు. సీఎంతో పాటు శాసనమండలి చైర్మన్ గుత్త సుఖేందర్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రులు కోమటిరెడ్డి



వెంకటరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ వేంనరేందర్ రెడ్డి.. యాదాద్రికి చేరుకున్నారు. పవిత్ర పుణ్యక్షేత్రం యాదగిరిగుట్టపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంప్రదాయ వేదపాఠశాల భవనానికి శంకుస్థాపన చేశారు. కంచి కామకోటి పీఠాధిపది శ్రీశంకర విజయేంద్ర సర్వస్వతి స్వామి సమక్షంలో ఈ క్రతువు జరిగింది. రూ.43.79 కోట్లతో క్షేత్రంలోని పెద్దగుట్ట ఆలయ నగరి లేఅవుట్ వద్ద 15 ఎకరాల విస్తీర్ణంలో వేదపాఠశాల భవనం నిర్మించనున్నారు. వచ్చే రెండేళ్లలో నిర్మాణం పూర్తి చేసి తరగతులు ప్రారంభించనున్నారు. అనంతరం శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని సీఎం దర్శించుకున్నారు.

# రైతు డిస్కమ్..

## వ్యవస్థను ముక్కలు చేసే కుట్ర..!

మొదటిపేజీ తరువాయి

ఈ నేపథ్యంలో, ప్రభుత్వం తరపున జర్నలిస్టులను తప్పుదోవ పట్టించేలా, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తూ పేరు లేని ఒక అనధికారిక లేఖ విడుదల కావడం ఇప్పుడు విద్యుత్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

**ఈఆర్సీ అనుమతి లేదు..**

రైతు డిస్కమ్ ఏర్పాటు కోసం ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలికి దరఖాస్తు చేసుకుందే తప్ప, ఇప్పటివరకు ఈఆర్సీ దానికి ఎలాంటి అనుమతి ఇవ్వలేదనేది సుస్పష్టం. అవసరాన్ని బట్టి ప్రాంతాల వారీగా కొత్త డిస్కమ్‌లను ఏర్పాటు చేసిన సంఘటనలు దేశంలో ఉన్నాయి కానీ.. ఇలా కేటగిరీల వారీగా (వ్యవసాయ రంగానికి మాత్రమే) ఒక డిస్కమ్‌ను ఏర్పాటు చేసి, వినియోగదారులను బలవంతంగా బదిలీ చేయడం చట్ట నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని విద్యుత్ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. కొత్త డిస్కమ్ ఏర్పాటుకు ముందు వినియోగదారులు, ఉద్యోగుల నుంచి అభిప్రాయ సేకరణ జరగాల్సి ఉన్నా, ఇంతవరకు అలాంటి ప్రక్రియే చేపట్టలేదని బాధ్యులపై విమర్శలు వస్తున్నాయి.

**నిధులెక్కడ? బోర్డు ఎక్కడ?..**

ప్రస్తుతం ఉన్న రెండు డిస్కమ్‌లు పబ్లిక్ లిమిటెడ్ సంస్థలుగా నడుస్తుండగా, కొత్తగా ఏర్పాటు చేస్తున్న రైతు డిస్కమ్‌కు ఎలాంటి బోర్డును ఏర్పాటు చేయలేదు. ఈ కొత్త సంస్థ కోసం కేవలం 5 లక్షల పైచిలుకు డీటీఆర్‌లను బదిలీ చేశారు తప్ప.. కొత్తగా ఎలాంటి విద్యుత్ లైన్లు కానీ, సబ్‌స్టేషన్లు కానీ కేటాయించలేదు. దీనికి తోడు, ఈ కొత్త డిస్కమ్ పరిధిలోకి వచ్చే వ్యవసాయం, మిషన్ భగీరథ నీటి సరఫరా, లిఫ్ట్ ఇరిగేషన్ వంటి పథకాలకు ఉపయోగించే విద్యుత్‌కు 'వీలింగ్ చార్జీలు' చెల్లించాలనే నిబంధన విధించడం భవిష్యత్తులో ఆయా వర్గాలకు పెద్ద భారంగా మారనుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇక ఆర్థిక పరంగా ఈ కొత్త డిస్కమ్‌కు నిధుల వనరులు ఎలా సమకూరుస్తారనే దానిపై యాజమాన్యాల నుంచి ఎలాంటి సమాధానం రావడం లేదు.

**ఉద్యోగ జేఏసీల వ్యతిరేకత.. ప్రజాభిప్రాయ సేకరణ తేదీ మార్పు**

ఉద్యోగుల విభజన విషయంలో కేవలం పదోన్నతులు కల్పిస్తామనే తప్పుడు ఆశలు చూపుతున్నారే తప్ప, సరైన విధానం పాటించడం లేదని ఉద్యోగ సంఘాలు మండిపడుతున్నాయి. ఇప్పటికే విద్యుత్ సంస్థల్లోని రెండు ప్రధాన ఉద్యోగ జేఏసీలు ఈ రైతు డిస్కమ్ ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో రైతులు, మేధావుల నుండి వ్యతిరేకత తీవ్రం కావడంతో, ఈనెల 28 వరకు ఉన్న ప్రజాభిప్రాయ సేకరణ చివరి తేదీని ఈనెల 29కి మారుస్తూ ఈఆర్సీ అత్యవసర ఉత్తర్వులు జారీ చేసింది. అదనంగా ఫిర్యాదులు స్వీకరించేందుకే ఈ గడువు పెంచినట్లు తెలుస్తోంది.

**నేడు సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం..**

రైతు డిస్కమ్ పేరుతో రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న మూడవ డిస్కమ్‌ను నిరసిస్తూ ఆదివారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో 'తెలంగాణ ఎలక్ట్రిసిటీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్' ఆధ్వర్యంలో ఒక భారీ రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ సమావేశంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డిలతో పాటు పలువురు విద్యుత్ నిపుణులు, మేధావులు, రైతు సంఘాల నాయకులు పాల్గొని ప్రభుత్వ మొండి వైఖరిని ఎండగట్టనున్నారు. కొనుగోలుదారులకు, వినియోగదారులకు నష్టం లేకుండా చట్టబద్ధంగా వ్యవహరించాలని, వ్యవస్థను నాశనం చేయవద్దని ఉద్యోగులు, నిపుణులు డిమాండ్ చేస్తున్నారు.



# పాలిసెట్ ఫలితాలు విడుదల!

**82.94 శాతం ఉత్తీర్ణత నమోదు..**

**ఈసారి కూడా బాలికలదే పైచేయి**

**ఎంపీసీ విభాగంలో 11 మందికి టాప్ ర్యాంకులు**

**హైదరాబాద్, మే 23:** తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ నిర్వహించిన పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (పాలిసెట్)–2026 ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. డిప్లొమా ఇంజనీరింగ్ కోర్సులలో ప్రవేశానికి జరిగిన ఈ పరీక్షలో మొత్తం 82.94 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది కూడా బాలుర కంటే బాలికలే ఎక్కువ శాతంతో ముందంజలో నిలిచారు. బాలికలు 86.38 శాతం ఉత్తీర్ణత సాధించగా, బాలురు 79.92 శాతంతో సరిపెట్టుకున్నారు. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ (ఎంపీసీ) విభాగంలో మొత్తం 98,029 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కాగా, వారిలో 81,307 మంది అర్హత సాధించారు. ఈ విభాగంలో 11 మంది విద్యార్థులు మొదటి ర్యాంకులను కైవసం చేసుకున్నారు. టాపర్లుగా నిలిచిన వారిలో నామాల లోకేష్ (వరంగల్), బానోతు హేమంత్ (సూర్యాపేట), అల్వియా షిఫాలీ (మంచిర్యాల), మహ్మద్ మహబూబ్ అర్భాజ్ అలీ (ఖమ్మం), కోట్ల అపూర్వ (మహబూబ్‌నగర్), అన్నం హరి కృష్ణ (సంగారెడ్డి), జంగాల అవినాష్ గౌడ్ (నల్గొండ), చిలక నంద వరదయ్యపేటహన్ రెడ్డి (ఖమ్మం), రుద్రోజు సాజన్ (సిద్దిపేట), దూరెడ్డి వన్మయ్ రెడ్డి (నాగర్‌కర్నూల్) ఉన్నారు. మ్యాథ్స్, బయోలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ (ఎంబీపీసీ) విభాగంలో 98,029 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 79,652 మంది అర్హత సాధించారు. ఈ విభాగంలో మహబూబ్‌నగర్‌కు చెందిన కోట్ల అపూర్వ, సిద్దిపేటకు చెందిన రుద్రోజు సాజన్ సంయుక్తంగా టాప్ ర్యాంక్‌ను దక్కించుకున్నారు. అర్హత సాధించిన విద్యార్థులకు త్వరలోనే కౌన్సిలింగ్ షెడ్యూల్ ప్రకటిస్తామని అధికారులు తెలిపారు.

# లక్షల్లో జీతం.. కోట్లల్లో ఆస్తులు!

- పోలీస్ శాఖలోనూ తగ్గని వాటా..
- పట్టుబడే వారిలో 40 శాతం వీరే
- లంచాల పరంపరలో పోటీపడుతున్న మహిళా అధికారులు
- విద్యుత్ శాఖలో ప్రమాద స్థాయి దాటిన అక్రమ సంపాదన
- కీలక శాఖల్లో తక్షణ ప్రక్షాళన జరిగితేనే వ్యవస్థలో మార్పు

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

జీతం లక్షల్లో హోదా కు దగ్గ అన్ని వసతులు.. సమాజంలో గౌరవం అన్ని ఉన్నా లక్షలు కోట్లు కావుకదా అందుకేనేమో హోదాను కుదవబెట్టి డబ్బులను కూడబెట్టి కోట్లు గడిస్తున్నారు కొందరు అధికారులు. అవినీతి నిరోధక శాఖ అధికారులు ఎప్పుడు రైడ్లు చేసినా కోట్ల కొద్దీ నగదు కిలోల కొద్దీ బంగారం, వెండి వందల ఎకరాల భూములు, కోట్ల విలువైన ప్లాట్స్ అక్రమ సంపాదనలో బయటపడుతోంది. ఒక జిల్లా స్థాయిలో ఉన్నా అధికారి పట్టు బడ్డాడంటే చాలు అయన ఆస్థి 100 కోట్లు ఇది ఇటీవల ఏసీబీ తనిఖీల్లో బయల్పడుతున్న నిజం.కేవలం అధికారం ద్వారా ఇస్తున్న వెసులుబాటును సొమ్ముగా మలుచుకొని సర్కారు భూములను సైతం దారాదత్తం చేస్తున్నారు.ఇలా కోట్ల రూపాయల ప్రజాధనం ప్రయివేట్ వ్యక్తుల పరం చేస్తూ అందులో కొంత వాటా లాగేస్తున్నారు.

### రెవిన్యూ శాఖలో ఇష్టారాజ్యం

తెలంగాణ లో రెవిన్యూ శాఖ కీలకమైన శాఖ ఈ శాఖలో ఎప్పుడు ఏ అధికారి ఏసీబీ లో పట్టుబడ్డా విచారణలో తేలేది ఆస్తులతో పాటు అయన హోదాను ఉపయోగించి చేసిన సర్దుబాట్లు.సహజంగా ఉన్నత స్థాయిలో ఉన్న అధికారులకు తహశీల్దార్ మొదలు రెవెన్యూ డివిజన్ ఆఫీసర్ ఆపై స్థాయి అధికారులకు భూసమస్యల విషయంలో పరిష్కారానికి వెసులుబాటు అధికారం ఉంటుంది. అది కేవలం ప్రజల సౌలభ్యం కోసం ప్రభుత్వం ప్రవేశ పెడితే దానిని ఆసరాగా చేసుకొని కొందరు కోట్లు గడిస్తున్నారు. ఇలా ఇటీవల పట్టుబడ్డ డిప్యూటీ కలెక్టర్ వంశీ మోహన్ తాను పని చేసిన శేరిలింగంపల్లి, అబ్దుల్లాపురమేట్ లలో వందల ఎకరాల వివాదస్పద భూములు ప్రయివేట్ వ్యక్తులకు దారాదత్తం చేయడం పై ఏసీబీ సైతం నివ్వెరా పోయిందట. అబ్దుల్లాపుర్మెట్ లో పనిచేస్తున్నప్పుడు పిగిలిపూర్ గ్రామంలో ప్రభుత్వ భూమి 8 ఎకరాలను ఏకంగా తన మామ పేరా బదలాయించడం ఆ భూమి రియల్ ఎస్టేట్ కోసం ఇచ్చి ప్లాట్లు పొందడాన్ని బట్టి చూస్తే ఒక వ్యక్తి తన అధికారాన్ని ఎంత దుర్వినియోగం చేయగలడో అర్థమవుతోంది. ఇక 5 ఏళ్ళు సేరి లింగంపల్లిలో పనిచేసినప్పుడు గోపన్నపల్లి లో 192 ఎకరాలను వేలకోట్ల విలువైన భూమి సైతం ప్రయివేట్ పరం చేశాడన్న విషయం వెలుగులోకి వచ్చింది. ఇది ఒక్క అధికారి చేసిన కొంత అవినీతి మాత్రమే ఇంకా ఇలా



ఎందరు అధికారులు ఎంత ప్రజా ధనాన్ని ప్రయివేట్ పరం చేస్తున్నారో అనేది పట్టుబడితే కానీ తెలియడం లేదు.

### పోలీసులు సైతం ముందంజ..

ఏసీబీ కేసుల్లో పోలీసులు తమ వాటా తగ్గకుండా చూసుకుంటున్నారు. పట్టుబడుతున్న కేసుల్లో కనీసం 40 శాతం వారే ఉండటం బట్టి a శాఖలో ఆవినీతి ఎంత మేర ఉందొ అర్థం చేసుకోవచ్చు. పోలీస్ శాఖలో సైతం కొందరి ఉద్యోగం కేవలం కోట్లు గడించే ప్రక్రియగా మార్చుకోవడమే అవినీతికి కారణమవుతోంది.ఇక పోతే పోస్టింగ్లకు సైతం లక్షల రుపాయాలు ఇవ్వాల్సి రావడం మూలంగా పెట్టిన డబ్బు రికవరీ చేయాలి కదా అనేది కొందరి వాదన. ఇలా రక్షక భటులు అనే పేరు కల్గిన శాఖలో అవినీతి పరుల సంఖ్య రోజురోజుకు పెరగడం ఆ శాఖకు పెద్ద మచ్చ.గత డీజీపీ మన పోలీసులే ఎక్కువ సంఖ్యలో ఏసీబీ వాళ్లకు పట్టుబడటం బాధగా ఉంది.ఒక పోలీస్ ఇంకో పోలీస్ తప్పు చేసాడని కేసు వేస్తే ఇక ప్రజలకు ఎలా జవాబుదారిగా ఎలా ఉండగలం అని అన్నాడంటే ఆ శాఖలో పేరుకుపోయిన అవినీతి ఆ అధికారికి ఎంత ఇబ్బందిగా పరిణమించిందో అర్థం చేసుకోవచ్చు.

### జల మండలి జీఎం ఇంట్లో వంద కోట్లకు పైగానే..

హైదరాబాద్ జలమండలి ప్రాజెక్టు డివిజన్-3 జీఎంగా పనిచేస్తున్న సగ్గం అనంతలక్షి కుమార్ ఇల్లు, అతడి బంధువులు, స్నేహితులకు చెందిన ఎనిమిది ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు నిర్వహించిన ఏకకాల సోదాల్లో వందల కోట్ల అవినీతి విశ్వరూపం బహిర్గతమైంది. నిజామాబాద్, సంగారెడ్డి, హైదరాబాద్ పరిధుల్లో రిజిస్ట్రేషన్ విలువల ప్రకారం రూ. 5.88 కోట్లుగా నమోదైనప్పటికీ బహిరంగ మార్కెట్లో దాదాపు రూ. 100 కోట్లకు పైగా విలువ చేసే భారీగా 500 రూపాయల నోట్ల కట్టలు, కిలోల కొద్దీ వెండి, బంగారు ఆభరణాలు, ఎకరాల కొద్దీ వ్యవసాయ భూములు మరియు విలువైన ప్లాట్ల దస్తావేజులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

### మహిళామణులేం తక్కువ కాదు

ఇటీవల జరుగుతున్న ఏసీబీ దాడుల్లో మహిళలో కూడా ఎక్కువ పట్టుబడటం ఒక పెద్ద సమస్యగా మారింది. మహిళల్లో అవినీతి తక్కువ కానీ ఇటీవల రేజర్వేషన్ పోరాటంలో ముందుండాలనేమో మహిళా అధికారులు కూడా ఎక్కువ సంఖ్యలో పట్టుబడటం విస్మయానికి గురిచేస్తోంది. కొన్ని శాఖల్లో కీలకమైన అధికారులైతే ఏకంగా పట్టుబడ్డప్పుడు నోట్ల కట్టలతోనే పట్టుబడుతుండం విస్మయానికి గురిచేస్తోంది.ఇలా మహిళలు కూడా అవినీతి పరంపరలో పోటీ పడటం అత్యంత ప్రమాదకరం .ఐతే ఇది ఏ ఒక్క శాఖాకేం పరిమితం కాలేదు సుమీ .

### విద్యుత్ శాఖలో మరింత తీవ్రం

అత్యంత ఆదాయ మార్గాలున్న శాఖ విద్యుత్ శాఖ అలాగే భద్రత మంచి జీతం ఉండేది ఈ శాఖలోనే ప్రభుత్వ రంగ సంస్థ ఐనా విద్యుత్ శాఖలో అవినీతి ప్రమాద స్థాయిని మించిపోయింది. ఇక్కడ పనులు కావాలంటే లక్షలు లంచం ఇవ్వాల్సిందే. ఆలా ఒక ఏడిఈ స్థాయిలో ఉన్న అధికారి సరాసరి ఆస్థి 100 కోట్ల పైనే ఉంటుందన్న విషయం తరచూ ఏసీబీ విచారణలో స్పష్టమవుతోంది. ఆ శాఖలో కొందరు అధికారులు సైతం పోస్టింగ్ కోసం కోటి పైనే ఖర్చుపెడతారట. ఆలా కొందరికి ఎప్పటికి ఫోకల్ పోస్టులే ఉంటాయని ఆ శాఖ అధికారులు చెబుతుంటారు. రెండు లక్షల లోపు జీతం ఉన్న ఆ స్థాయి అధికారుల్లో అవినీతి పరులకు వందల కోట్ల ఆస్తులు ఎలా వస్తున్నాయ్. ఆలా కోట్లు గడుస్తున్నా ఆదాయపు పన్ను శాఖ ఎందుకు కనుక్కోలేక పోతుందన్న ప్రశ్నలు ఉన్నాయ్. ఏసీబీ పట్టుబడితే చాలు మార్కెట్ విలువ 100 కోట్లు దాటేస్తోంది.ఇలా ఆపై అధికారులు ఇంకెంత గడించి ఉంటారో అర్థం చేసుకోవచ్చు. రెవెన్యూ పోలీస్ తర్వాత అత్యంత ఖరీదైన శాఖ విద్యుత్ ఇక్కడ కొందరు యువకులు లంచాలు బాగా వస్తాయనే ఉద్యోగం లోకి రావడం బాధాకరం. ఏది ఏమైనా కీలక శాఖల్లోని అవినీతి పరులను ఎప్పటికప్పుడు ప్రక్షాళన చేస్తే తప్ప అదనపు ఆదాయం మాత్రమే ప్రదానం అనే ఆలోచనలో మార్పు వచ్చే అవకాశం ఉంది.

### అన్ని శాఖల్లోనూ అదేతీరు !

మున్సిపల్,ఫారెస్ట్,పంచాయత్ రాజ్, రిజిస్ట్రేషన్, ట్రాన్స్పోర్ట్ ,మైనింగ్ ,సాగునీటి పారుదల శాఖ ,రోడ్లు భవనాలు ఒకటేమిటి అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి పరంపర ఒక ఆనవాయితీగా సాగుతోంది.ఒకవైపు ప్రభుత్వం అవినీతి నిర్మూలనకు అడ్డుకట్ట వేయాలని ప్రయత్నిస్తుండగా, అధికారులు ప్రత్యామ్నాయం వెతుకుతుండటం శోచనీయం.ఇప్పుడు కొన్ని శాఖల్లో ఎంత సంపాదిస్తే అంత గొప్పన్న చందంగా మారింది మరి.



సంపాదకీయం

# విమర్శలపై హుందాతనం ఏదీ ?

భారత ప్రజాస్వామ్యంలో అధికార, ప్రతిపక్షాల మధ్య వైరుధ్యం సహజమైందే అయినా, ఇటీవల కాలంలో ఈ విమర్శల తీవ్రత మునుపెన్నడూ లేని స్థాయికి చేరుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు 'ఇండియా' కూటమి పక్షాలు చేస్తున్న ఆరోపణలు దేశవ్యాప్తంగా సరికొత్త రాజకీయ దుమారానికి దారితీస్తున్నాయి. గ్లోబల్ ఆర్థిక సవాళ్లు, దేశీయ విధానాలపై విపక్షాలు సంధిస్తున్న ప్రశ్నలు ఒకవైపు ప్రజాస్వామ్య జవాబుదారీతనాన్ని గుర్తుచేస్తుండగా, మరోవైపు వినియోగిస్తున్న భాషా శైలి రాజకీయ హుందాతనాన్ని ప్రశ్నిస్తోంది. ప్రస్తుతం ప్రతిపక్షాలు ప్రధానంగా మూడు అంశాలపై కేంద్రీకృతమై మోదీ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇందులో మొదటిది ఆర్థిక సవాళ్లు – పొదుపు పిలుపుపై విమర్శలు చేస్తున్నారు. అంతర్జాతీయంగా చమురు ధరల హెచ్చుతగ్గులు, రూపాయి విలువ క్షీణతను ప్రస్తావిస్తూ ప్రభుత్వంపై విపక్షాలు విరుచుకుపడుతున్నాయి. విదేశీ పర్యటనలు తగ్గించుకోవాలని, చమురు వాడకంపై పొదుపు పాటించాలని ప్రధాని మోదీ ప్రజలకు చేసిన విజ్ఞప్తిని విపక్షాలు "ప్రభుత్వ వైఫల్య నిదర్శనంగా" అభివర్ణిస్తున్నాయి. రెండవది విదేశీ పర్యటనలపై విమర్శలు.. దేశీయంగా సామాన్యుడు ద్రవ్యోల్బణంతో ఇబ్బంది పడుతుంటే, ప్రధాని మాత్రం విదేశీ పర్యటనలతో కాలక్షేపం చేస్తున్నారని రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. అయితే ప్రధాని విదేశీ పర్యటనలు దేశ ప్రతిష్టను, వ్యూహాత్మక ప్రయోజనాలను పెంచేందుకేనని సీనియర్ నేత శరద్ పవార్ వంటి వారు విపక్షాల విమర్శలతో విభేదించడం గమనార్హం. మూడవది కార్పొరేట్ అనుకూల విధానాలపై ప్రశ్నిస్తున్నారు. దేశ సంపద, విధానాలు కేవలం కొద్దిమంది పారిశ్రామికవేత్తల ప్రయోజనాల కోసమే మలచబడుతున్నాయని విపక్షాలు పదేపదే ఆరోపిస్తున్నాయి. ఈ క్రమంలోనే ప్రధానిని లక్ష్యంగా చేసుకుని విపక్ష నేతలు ఉపయోగించిన దేశద్రోహి వంటి పదజాలం ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీసింది. ప్రభుత్వ ఆర్థిక విధానాలను తప్పుబట్టడం, అంతర్జాతీయ ఒప్పందాలపై నిలదీయడం ప్రతిపక్షాల హక్కు మరియు బాధ్యత. గ్లోబల్ సవాళ్ల నేపథ్యంలో దేశీయ మార్కెట్లను సురక్షితం చేయడం ప్రభుత్వానికి ఎంత సవాల్లో, సామాన్యుడిపై భారం పడకుండా నిరంతర నిఘా ఉంచడం విపక్షాలకూ అంతే ముఖ్యం. కానీ రాజకీయ ప్రయోజనాల కోసం దేశ ప్రధాని పదవిపై వ్యక్తిగత దూషణలకు దిగడం, తీవ్రమైన పదజాలంతో వ్యవస్థల ప్రతిష్టను తగ్గించడం ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి సంకేతం కాదన్నది విశ్లేషకుల అభిప్రాయం. పాలకపక్షం, ప్రతిపక్షాల నిర్మాణాత్మక విమర్శలను స్వీకరిస్తూ ఆర్థిక క్రమశిక్షణ దిశగా అడుగులు వేయాలి. అదే సమయంలో ప్రతిపక్షాలు కూడా కేవలం రాజకీయ విద్వేష ప్రచారాలకే పరిమితం కాకుండా, ప్రత్యామ్నాయ ప్రణాళికలతో ప్రజల ముందుకు రావాలి. ఆరోపణల్లో పదును ఎంత ముఖ్యమో, పార్లమెంటరీ సంప్రదాయాల పట్ల హుందాతనం కూడా అంతే ముఖ్యం అన్న సత్యాన్ని ఉభయ పక్షాలూ గుర్తుంచుకోవాలి.

# బీఆర్ఎస్ నాయకుడి దారుణ హత్య!

**నల్లగొండ, సిరి న్యూస్:**

శుక్రవారం రాత్రి ప్రత్యర్థులు ఆయనను వేటకొడవళ్లతో నరికి చంపడమే కాకుండా, మృతదేహాన్ని రెండు ముక్కలుగా నరికి, మూడు గోనె సంచుల్లో కట్టి గ్రామ సమీపంలోని ఎస్సారెస్పీ కాలువలో పడేశారు. ఈ అమానుష ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. గ్రామంలో కొనసాగుతున్న పాత రాజకీయ విభేదాలు, ఆధిపత్య పోరే ఈ దారుణ హత్యకు కారణమై ఉండొచ్చని బలంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మధు భార్య మౌనిక గతంలో బీఆర్ఎస్ తరఫున యార్కారం గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. గ్రామ రాజకీయాల్లో ఈ కుటుంబానికి బలమైన పట్టు ఉంది. కాగా, ఈ గ్రామంలో 1985 నుండి ఇప్పటివరకు సుమారు 8 రాజకీయ హత్యలు చోటుచేసుకోవడం ఇక్కడి ఫ్యాక్షన్ తీవ్రతకు అద్దం పడుతోంది.

### పోలీసులకు తెలిసే జరిగింది: జగదీశ్వర్ రెడ్డి

హత్యకు గురైన మధు కుటుంబాన్ని శనివారం బీఆర్ఎస్ మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి పరామర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ హత్య పోలీసుల సహకారంతోనే జరిగిందని తీవ్ర ఆరోపణలు చేశారు. మధు గతంలో జరిగిన ఒక హత్య కేసులో ముఖ్య సాక్షి అని, ఆయనకు ప్రత్యర్థుల నుండి ప్రాణాపాయం ఉందనే విషయం పోలీసులకు తెలుసన్నారు. ఈ విషయంలో రక్షణ కల్పించాల్సిన స్థానిక ఎస్సై.. సాయం చేయకపోగా, "నువ్వు లేచిపోతావ్ (చనిపోతావ్)" అంటూ మధును ముందే భయపెట్టారని, దీని వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని మండిపడ్డారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ)ని కూడా మార్చడం అనుమానాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ నేతలే పథకం ప్రకారం మధును పిలిపించి హత్య చేయించారని ఆరోపించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకునే వరకు బీఆర్ఎస్ పార్టీ తరఫున పెద్ద ఎత్తున పోరాడుతామని జగదీశ్వర్ రెడ్డి హెచ్చరించారు.

## నేడు యాదగిరిగుట్టకు సీఎం రేవంత్

### వేద పాఠశాలకు భూమిపూజ

**హైదరాబాద్, మే 22 :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం యాదగిరిగుట్టలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. వేద పాఠశాలకు భూమిపూజ, లక్ష్మీనరసింహస్వామి దర్శనం చేసుకోనున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన షెడ్యూల్ విడుదలైంది. శనివారం ఉదయం 9 గంటలకు హైదరాబాద్ బేగంపేట నుంచి హెలికాప్టర్‌లో యాదగిరిగుట్టకు సీఎం రేవంత్ రెడ్డి బయలుదేరుతారు. అనంతరం 9:15 గంటలకు ప్రతిపాదిత వేద పాఠశాల స్థలానికి చేరుకుంటారు. 9:15 నుంచి 9:45 మధ్య వేద పాఠశాలకు భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం రేవంత్ పాల్గొంటారు. సరిగ్గా ఉదయం 9:37 గంటలకు ఎస్ఎల్ఎన్ఎస్‌డీ వేద పాఠశాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. 9:50కు వేద పాఠశాల స్థలం నుంచి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి బయలుదేరుతారు రేవంత్ రెడ్డి. 10 గంటలకు దేవాలయానికి చేరుకుంటారు. 10 నుంచి 10:30 వరకూ స్వామివారిని దర్శించుకుంటారు. 10:30కు ప్రెసిడెన్షియల్ సూట్‌కు బయలుదేరి 10:40కి అక్కడికి చేరుకుంటారు. దయం 10:40 నుంచి 11 గంటల వరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విశ్రాంతి తీసుకుంటారు. 11 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 11:10కి హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అనంతరం 11:15కు యాదగిరిగుట్ట నుంచి హైదరాబాద్‌కు తిరుగు పయనమవుతారు.

# ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ వ్యాపారం



**హైదరాబాద్, మే 22:** డీవియేషన్ ఉంటే రైతుల భూములు వెనక్కి ఇవ్వాలని చట్టంలో ఉందని వెల్లడించారు. ఫార్మా సిటీని కొనసాగిస్తామని ఓ వైపు కోర్టుకు చెబుతూ.. రేవంత్ ప్రభుత్వం జిమ్మిక్కు చేస్తోందని విమర్శించారు. ఫార్మా సిటీ వస్తే దానికి అనుబంధంగా కనీస సౌకర్యాలు ఎడ్యుకేషన్, హౌసింగ్ రావాలని ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. 75శాతం ఫార్మా సిటీ ఉండి... మిగతా 25శాతం మిగతావి ఉండాలని అన్నారు. కానీ..75శాతం మిగతా వ్యాపారం చేసి.. కేవలం 25శాతమే ఫార్మా వచ్చేలా చేస్తున్నారని విమర్శించారు. ఇది చట్ట ప్రకారం చెల్లదన్నారు. ఫ్యూచర్ సిటీ పేరుతో కాంగ్రెస్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని మాజీ మంత్రి ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని.. ఫార్మా సిటీని రీస్టోర్ చేస్తామని స్పష్టం చేశారు. 'ఇది నా మాట కాదు.. పార్లమెంట్ చట్టం. ఫార్మా సిటీ వస్తే లక్షలాది మందికి ఉద్యోగాలు వస్తాయని మేము ప్రారంభించాం. మన దగ్గర నుంచి ఒక్క ఫార్మా కంపెనీ బయటికి వెళ్లొద్దని చేశాం. ఇప్పటికే రెండున్నరేళ్లు గడిచిపోయింది. లాస్ట్ వన్ ఇయర్ ఎలక్షన్ ఉంటుంది. రేవంత్ సర్కార్ ఏమీ చేయలేదు. భూములు పంచి పెడితే బ్యాక్ ఎండ్ ఏదో లబ్ది పొందాలని పాలాన్ చేశారు. ఫార్మా సిటీ అభివృద్ధి చెందితే బీఆర్ఎస్‌కు పేరు వస్తుందని ఇలా చేశారు. ఉన్నది ఉన్నట్టుగా అక్కడ ఫార్మా సిటీనే వస్తుంది' అని హరీశ్ రావు స్పష్టం చేశారు.

# ఫ్యూచర్ సిటీపై హరీష్‌రావు వ్యాఖ్యలు సరికాదు

### జర్నలిస్టులకు ఇళ్లస్థలాల కేటాయింపును అడ్డుకుంటారా?

### టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య

**హైదరాబాద్, మే 22:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టబోతున్న ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపై మాజీ మంత్రి, బీఆర్ ఎస్ నేత హరీష్ రావు చేసిన వ్యాఖ్యలు సహేతుకమైనది కాదని, అభివృద్ధి విషయంలో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య పేర్కొన్నారు. రాబోయే ప్రభుత్వం బీఆర్ ఎస్ అనీ, తాము అధికారంలోకి రాగానే ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని మాజీ మంత్రి హరీష్ రావు అనడం పట్ల ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ, హరీష్ రావు వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. ఫ్యూచర్ సిటీలో జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు కేటాయించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న ప్రయత్నాన్ని తాము స్వాగతిస్తున్నామని, అయితే ఈ ప్రయత్నాన్ని అడ్డుకోవడం కోసమే హరీష్ రావు కుట్రపూరిత వ్యాఖ్యలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్టులకు గత పదేళ్ళలో టీఆర్ ఎస్, బీఆర్ ఎస్ ప్రభుత్వం చేయలేని పని కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్నారని మామిడి సోమయ్య అన్నారు. జర్నలిస్టులకు,సివిల్ సర్వీసెస్ అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫ్యూచర్ సిటీలో 500 ఎకరాల భూమి కేటాయిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించిన ప్రస్తుత సమయంలో మాజీ మంత్రి హరీష్ రావు ఈ విధమైన వ్యాఖ్యలు చేయడం పాత్రికేయుల్లో ఆవేదన,ఆందోళన వ్యక్తమవుతుందని ఆయన పేర్కొన్నారు. తమ రాజకీయ కక్షలు, స్వార్ధ ప్రయోజనాల కోసం ప్రతిపక్ష నేతలు ప్రజల అభివృద్ధిని, సంక్షేమ కార్యక్రమాలను అడ్డుకోవడం సరైంది కాదని, జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు కేటాయించబోయే ఫ్యూచర్ సిటీకి అడ్డుపడడం బీఆర్ ఎస్ పార్టీ చేయబోయే పెద్ద తప్పిదమని అన్నారు. తొమ్మిదిన్నరేళ్ళు అధికారంలో ఉండి జర్నలిస్టులకు ఏమీ చేయని ప్రతిపక్ష బీఆర్ ఎస్ నాయకులు జర్నలిస్టుల సంక్షేమానికి అడ్డురావడం సరైంది కాదని అన్నారు.

## పశువుల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలి



**కాగజ్‌నగర్,సిరి న్యూస్ :** రాష్ట్రంలో పశువుల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ జాతీయ అధికార ప్రతినిధి డాక్టర్ రావినూతల శశిధర్, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు కోరారు. శనివారం హైదరాబాద్ లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో గోవులు, ఇతర పశువుల అక్రమ రవాణా విపరీతంగా పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. లేత వయసులో ఉన్న పశువులను కూడా వధశాలలకు తరలిస్తూ పశు సంరక్షణ చట్టాలను ఉల్లంఘిస్తున్నారని పేర్కొన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అక్రమ రవాణాను అరికట్టేందుకు కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దీనిపై మంత్రి వాకిటి శ్రీహరి సానుకూలంగా స్పందించి, సమస్యపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వీహెచ్ పీ నాయకులు ప్రశాంత్, వినయ్ పత్రాలే, బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు ఆలె భాస్కర్, సంజయ్ ఘనాతే, గో రక్షకులు జస్మత్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి కలిసి పనిచేయాలి



**ఆదిలాబాద్,సిరి న్యూస్ :** పార్టీ బలోపేతానికి అందరు కలిసి పనిచేయాలని టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి గంద్రత్ సుజాత అన్నారు. ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ విభాగం నూతన చైర్మన్ పరమేశ్వర్ కోలేట్కర్‌ను శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి, దళితుల సంక్షేమానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎస్సీ విభాగం ద్వారా ప్రజలకు మరింత సేవలు అందించేందుకు సమష్టిగా పనిచేయాలని సూచించారు. తనకు లభించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, గంద్రత్ సుజాత మార్గదర్శకత్వంలో ఎస్సీ విభాగం ద్వారా ప్రజలకు సేవ చేస్తానని పరమేశ్వర్ కోలేట్కర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జైనథ్ మండల ఎస్సీ విభాగం అధ్యక్షుడు గంగన్న, మేకల జితేందర్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పరమేశ్వర్ ను సన్మానించిన డీసీసీ అధ్యక్షుడు



**ఆదిలాబాద్,సిరి న్యూస్ :** ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ విభాగం చైర్మన్‌గా నియమితులైన పరమేశ్వర్ కోలేట్కర్‌ను డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ కోలేట్కర్ డీసీసీ అధ్యక్షుడిని మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. పార్టీ బలోపేతానికి, ఎస్సీ విభాగం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్ మాట్లాడుతూ నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మల్యాల కరుణాకర్, సంజయ్, దౌలత్ రావు, అడ్వకేట్ శ్రావణ్ నాయక్, గంగాధర్, రాధేశ్యామ్, బండారి సతీష్, ఎస్సీ విభాగం కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఓఆర్ఆర్ పరిధిలోని పాత పరిశ్రమల

- **భూముల మార్పిడికి గ్రీన్ సిగ్నల్**
- **సుమారు 9,292 ఎకరాల భూములను మల్టీ యూజ్ జోన్లుగా మార్చే అవకాశం**
- **నివాసాలు, ఐటీ పార్కులు, కమర్షియల్ కాంప్లెక్స్‌ల ఏర్పాటుకు వెసులుబాటు**
- **పాలసీ విధివిధానాలు విడుదల చేసిన మంత్రి శ్రీధర్ బాబు**



**హైదరాబాద్, సిరి న్యూస్:**

హైదరాబాద్‌లోని పాత పరిశ్రమల భూములను మల్టీ యూజ్ జోన్లుగా మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ' అధికారిక విధివిధానాలను రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆన్‌లైన్‌లో విడుదల చేశారు. శనివారం సెక్రటేరియట్‌లో నిర్వహించిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, టీజీఐఐసీ ఎండీ శశాంకలు కలిసి లాంఛనంగా ఈ విధివిధానాల నివేదికను ఆన్‌లైన్ ద్వారా ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న సుమారు 9,292 ఎకరాల పరిశ్రమల భూములను సమర్థవంతంగా వినియోగించుకోవడమే లక్ష్యంగా ఈ కొత్త పాలసీని ప్రభుత్వం రూపొందించింది. ఈ పాలసీ ద్వారా భవిష్యత్తులో సదరు పారిశ్రామిక భూముల్లో నివాస గృహ సముదాయాలు, ఐటీ పార్కులు, వాణిజ్య సముదాయాలు, అత్యాధునిక ఆసుపత్రులు మరియు ప్రముఖ విద్యాసంస్థలను ఏర్పాటు చేసుకునేందుకు పారిశ్రామికవేత్తలకు, యాజమాన్యాలకు పూర్తి వెసులుబాటు కలుగుతుంది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, ఎండీ శశాంకలు ఓఆర్ఆర్ పరిధిలోని పాత పరిశ్రమల యజమానులతో ముఖాముఖి సమావేశమయ్యారు. హెచ్ఐఎల్‌టీపీ విధివిధానాల అమలు, ఎదురయ్యే సవాళ్లపై వారి అభిప్రాయాలను, సూచనలను అడిగి తెలుసుకున్నారు. ఈ పాలసీకి సంబంధించిన పూర్తి నియమ నిబంధనలు, మార్గదర్శకాలు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని మంత్రి తెలిపారు. ఈ విధానంపై సందేహాల నివృత్తికి, సలహాలు స్వీకరించడానికి త్వరలోనే ఒక ప్రత్యేక టోల్ ఫ్రీ నంబర్‌ను సైతం ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు.

# పస్తులుండలేం పనులు చేయలేం






- **నెలల జీతం కోసం రోడ్డెక్కిన కార్మికులు**
- **ఐదు నెలలుగా రాణి జీతాలు**
- **చెత్తను క్లీన్ చేస్తారు కానీ వీరి బతుకులు ఎప్పుడు క్లియర్ అయ్యేను**

**జిన్నారం మే 23 సిరి న్యూస్**

జిన్నారం మున్సిపల్ కార్మికులకు ఐదు నెలలుగా జీతాలు రాకపోవడంతో మున్సిపల్ కార్యాలయం ముందు శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు.జీవనభృతి కరువు గత ఐదు నెలలుగా జీతాలు అందకపోవడంతో మున్సిపల్ పారిశుద్ధ కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ నిత్యం ప్రాణాలను పణంగా పెట్టి జిన్నారం పుర పాలికను శుభ్రం చేసే కార్మికులకు కనీసం సకాలంలో వేతనాలు ఇవ్వకపోవడం పై సర్వత్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**నరకప్రాయంగా మారిన జీవితాలు:**

గత ఐదు నెలలుగా వేతనాలు రాకపోవడంతో పారిశుద్ధ్య కార్మికుల కుటుంబాలు ఆకలితో అలమటిస్తున్నాయని వారి జీవితాలు నరకప్రాయంగా మారాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.అప్పులు కూడా పుట్టని పరిస్థితి, నిత్య అవసరాలు, ఇండ్ల అద్దెలు, పిల్లల చదువుల కోసం కార్మికులు ఇప్పటికే విపరీతంగా అప్పులు చేశారని, జీతాలు రాకపోవడంతో ఇప్పుడు కిరాణా సామాన్లు కూడా కొనుక్కోలేని పరిస్థితిలో వారు ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ఐదు నెలల జీతాల బకాయిలను తక్షణమే ఒకే విడతలో చెల్లించాలని లేనిపక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో పనులను పూర్తిగా బంద్ చేసి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెకు దిగుతామని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, పారిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు

## రామాయంపేట మున్సిపాలిటీలో షటర్ల వ్యవహారంపై బీజేపీ ఆగ్రహం

- **"రీ-టెండర్‌లో జాప్యం వల్ల రూ.4 కోట్ల ఆదాయ నష్టం"**
- **కమిషనర్‌పై కుమ్మక్కు ఆరోపణలు**
- **ఆందోళనలకు హెచ్చరిక**

**రామాయంపేట:మే23(సిరి న్యూస్)**



రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో లీజు గడువు ముగిసిన 13 షటర్ల వ్యవహారం రాజకీయంగా హాట్‌టాపిక్‌గా మారింది. ఈ అంశంపై భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు తీవ్ర స్థాయిలో మున్సిపల్ అధికారులపై విమర్శలు గుప్పించారు. లీజు కాలం పూర్తయినా ఇప్పటివరకు రీ-టెండర్ నోటిఫికేషన్ జారీ చేయకపోవడం వల్ల మున్సిపాలిటీకి భారీగా ఆదాయ నష్టం జరుగుతోందని ఆయన ఆరోపించారు.శనివారం అయన విలేకర్లతో మాట్లాడుతూ ఆగ్రహం వ్యక్తం చేశారు.మూడు నుంచి నాలుగు కోట్ల ఆదాయం కోల్పోతున్న మున్సిపాలిటీ లీజు గడువు ముగిసిన షటర్లను వెంటనే బహిరంగ వేలం ద్వారా తిరిగి కేటాయిస్తే రామాయంపేట మున్సిపాలిటీకి మూడు నుంచి నాలుగు కోట్ల రూపాయల వరకు ఆదాయం వచ్చే అవకాశముందని రాగి రాములు పేర్కొన్నారు. కానీ అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా ప్రజా ధనం నష్టపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.తూప్రాన్ పట్టణంలో దుకాణాల బహిరంగ వేలానికి చర్యలు తీసుకుంటున్న అదే కమిషనర్, రామాయంపేట విషయంలో మాత్రం ఎందుకు మౌనం పాటిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఈ భిన్న వైఖరి ప్రజల్లో అనుమానాలకు తావిస్తోందన్నారు.గతంలో లీజుకు తీసుకున్న కొంతమంది దుకాణదారులతో అధికారులు కుమ్మక్కయ్యారని, స్వార్థ రాజకీయ నాయకుల ఒత్తిడితో రీ-టెండర్ ప్రక్రియను కావాలనే ఆలస్యం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రజా ప్రయోజనాలను పక్కనబెట్టి కొందరి ప్రయోజనాల కోసం వ్యవస్థ పనిచేస్తోందని మండిపడ్డారు.మున్సిపాలిటీ ఆదాయాన్ని పెంచేలా వెంటనే రీ-టెండర్ నోటిఫికేషన్ జారీ చేసి బహిరంగ వేలం నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. పారదర్శక విధానంలో వేలం నిర్వహిస్తే మున్సిపాలిటీకి భారీ ఆదాయం సమకూరుతుందని తెలిపారు.ఈ అంశంలో కమిషనర్ తక్షణ చర్యలు తీసుకోకపోతే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అవసరమైతే అన్ని షటర్లను మూసివేసి రీ-టెండర్ పూర్తయ్యే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ వ్యవహారాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు రాగి రాములు తెలిపారు. మున్సిపాలిటీకి కోట్ల రూపాయల ఆదాయం వచ్చే అవకాశాన్ని పాలకవర్గం నిర్లక్ష్యం చేయడం బాధాకరమన్నారు. రీ-టెండర్ ద్వారా వచ్చే ఆదాయాన్ని రామాయంపేట అభివృద్ధి పనులకు వినియోగించాలని ఆయన సూచించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటూ స్వార్థ రాజకీయాలకు అతీతంగా పాలన సాగించాలని చైర్మన్, అధికార యంత్రాంగానికి విజ్ఞప్తి చేశారు.ప్రజా ధనం కాపాడటం, మున్సిపాలిటీ అభివృద్ధి సాధించడం కోసం భారతీయ జనతా పార్టీ పోరాటం కొనసాగిస్తుందని రాగి రాములు స్పష్టం చేశారు. వెంటనే చర్యలు తీసుకుని పారదర్శకంగా రీ-టెండర్ నిర్వహించాలని మరోసారి డిమాండ్ చేశారు.

# మానవత్వమే ప్రధాన ధర్మం

- **గుర్తుతెలియని మృతదేహానికి అంత్యక్రియలు**

**తాండూర్,(సిరి న్యూస్):** మానవత్వమే ప్రధాన ధర్మం అని కొత్తపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి మెరుగు లక్ష్మణ్ అన్నారు. తాండూర్ ఎస్సై ప్రసాద్ లేఖ ద్వారా అందించిన అధికారిక విజ్ఞప్తి మేరకు గ్రామ శివారులో ఈనెల 20న లభ్యమైన గుర్తుతెలియని మృతదేహానికి కొత్తపల్లి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో శనివారం గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసు శాఖ చట్టపరమైన విచారణ, పంచనామా, పోస్టుమార్టం ప్రక్రియలను పూర్తి చేసిన అనంతరం మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించేందుకు గ్రామ పంచాయతీ సహకారం కోరినట్లు అధికారులు తెలిపారు. దీనికి స్పందించిన గ్రామపంచాయతీ వెంటనే అవసరమైన సిబ్బంది, కార్మికులను ఏర్పాటు చేసి అంత్యక్రియలు నిర్వహించినట్లు పంచాయతీ కార్యదర్శి పేర్కొన్నారు. ఎవరూ లేని పరిస్థితుల్లో కూడా ప్రతి మనిషికి చివరి గౌరవం దక్కాలనే మానవతా భావంతో గ్రామపంచాయతీ ఖర్చులతో ఈ కార్యక్రమాన్ని బాధ్యతగా పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రజాసేవలో భాగంగా మానవీయ విలువలను కాపాడటం స్థానిక సంస్థల బాధ్యత అని పేర్కొన్నారు. మృతుని ఆత్మకు శాంతి చేకూరాలని గ్రామపంచాయతీ తరపున ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, సంబంధిత కార్మికులు, పోలీస్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యేలు

- ప్రజా సమస్యల పరిష్కారానికి వినతి
- సంగారెడ్డి, జహీరాబాద్, పటాన్‌చెరు ఎమ్మెల్యేల ఉమ్మడి భేటీ
- తాగునీరు, రోడ్లు, ఇందిరమ్మ ఇళ్లపై సుదీర్ఘ చర్చ
- జొన్నల కొనుగోలుపై ఆంక్షలు తొలగించాలని డిమాండ్
- సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించిన కలెక్టర్

**సంగారెడ్డి, సిరి న్యూస్:**

జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు ప్రధాన సమస్యల పరిష్కారం, నియోజక వర్గాల అభివృద్ధి పనులను వేగవంతం చేయడంపై సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సంయుక్తంగా ముందడుగు వేశారు. శనివారం కలెక్టరేట్‌లోని ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను ముగ్గురు ఎమ్మెల్యేలు మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ.. తన నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, వెంటనే కొత్త బోర్‌వెల్స్ మంజూరు చేయాలన్నారు. అలాగే ఎమ్మెల్యే కోటా కింద 40 శాతం ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని, దెబ్బతిన్న జహీరాబాద్–తాండూర్ ప్రధాన రహదారులకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. నియోజక వర్గంలో నెలకొన్న ఇరిగేషన్ సమస్యల వల్ల సాగునీటి కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని, సంబంధిత శాఖలను సమన్వయం చేసి సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరారు.



సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ.. జొన్నల కొనుగోలు విషయంలో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని మండిపడ్డారు. ఎకరానికి 35 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంటే, ప్రభుత్వం కేవలం 10 క్వింటాళ్లే కొనడం దారుణమన్నారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా కనీసం ఎకరానికి 20 క్వింటాళ్ల చొప్పున కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న రోడ్లు, మౌలిక వసతుల పనులను వేగవంతం చేయాలన్నారు. ఎమ్మెల్యేల వినతులపై కలెక్టర్ ప్రతీక్ జైన్ సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సంజీవ్ రెడ్డి, తట్టు నారాయణ, మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, చింత సాయినాథ్, గోవర్ధన్ నాయక్, సర్పంచ్ హరివర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# 137 మందికి ఉద్యోగ నియామక పత్రాలు

- జాబ్ మేళా అభ్యర్థులకు ఆఫర్ లెటర్ల అందజేత
- అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగాలి
- నిరుద్యోగ యువత ఉపాధిపై ప్రభుత్వ ప్రత్యేక దృష్టి
- అడిషనల్ కలెక్టర్ పాండు

**సంగారెడ్డి, సిరి న్యూస్:**

ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 8వ తేదీన నిర్వహించిన మెగా జాబ్ మేళాలో వివిధ ప్రముఖ ప్రైవేట్ కంపెనీలకు ఎంపికైన 137 మంది అభ్యర్థులకు శనివారం నియామక పత్రాలను అందజేశారు. కలెక్టరేట్ గ్రీవెన్స్ హాలులో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ పాండు ముఖ్య అతిథిగా హాజరై, ఎంపికైన యువతీ యువకులకు జాబ్ ఆఫర్ లెటర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ పాండు మాట్లాడుతూ.. జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని తెలిపారు. జాబ్ మేళాల ద్వారా ప్రైవేట్ రంగంలోని ఉద్యోగాలను గ్రామీణ యువతకు సైతం చేరువ చేస్తున్నామని పేర్కొన్నారు. యువత తమ విద్యార్హతలు, నైపుణ్యాలకు తగినట్లుగా వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కేవలం ఉద్యోగం సాధించడమే కాకుండా, విధుల్లో చేరిన తర్వాత క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేస్తే కెరీర్‌లో మరిన్ని ఉన్నత అవకాశాలు లభిస్తాయని స్పష్టం చేశారు. ఉద్యోగాలు సాధించిన యువత తమ కుటుంబాలకు ఆర్థిక బాసటగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జీఎం తుల్జారాం నాయక్, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి మరియు ఎంపికైన అభ్యర్థులు పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోళ్లలో వైఫల్యాలపై కదంతొక్కిన రైతులు

- సుల్తాన్‌పూర్ నుంచి చౌటకూరు వరకు పాదయాత్ర
- కల్లాల వద్దే వరి ధాన్యం నిల్వలు
- మంత్రి దామోదర్ రాజనర్సింహ చొరవ చూపాలి...
- మాజీ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ మఠం బిక్షపతి..

**జోగిపేట, మే 23, (సిరి న్యూస్)::**



సంగారెడ్డి జిల్లా చౌటకూరు మండలంలో వరి ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ నిర్లక్ష్యంపై మండలానికి చెందిన రైతులు నిరసనగా శనివారం పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్రకు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, స్థానిక యువజన సంఘాలు మద్దతు పలికాయి. సుల్తాన్‌పూర్ గ్రామం నుంచి చౌటకూర్‌లోని మండల తహశీల్దార్ కార్యాలయం వరకు రైతులు పాదయాత్రను చేపట్టారు.క్షేత్రస్థాయిలో రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోళ్లు లేక కల్లాల వద్దే నెలల తరబడి పేరుకుపోయాయని, కొనేవారే కరువయ్యారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ముందుకు కదిలారు. నాయకులు చౌటకూర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి, స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం**

, వడ్ల కొనుగోలు ప్రక్రియలో ప్రభుత్వం విఫలమైందని తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం బిక్షపతి ఆరోపించారు. రైతులు చేపట్టిన పాదయాత్రకు మద్దతు తెలిపిన అనంతరం వారిని ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలో రేవంత్ సర్కార్ అధికారంలోకి వచ్చాక అన్నదాతల కష్టాలు ఎక్కువయ్యాయన్నారు. వర్షాకాలం దగ్గరలో ఉన్నందున కనీసం ధాన్యం తడవకుండా ఉండేందుకు టార్పాలిన్లు కూడా అందించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని ఆరోపించారు. ఈ వ్యవహారంపై స్థానిక అధికారులను నిలదీయగా పొంతనలేని సమాధానాలు చెప్పడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రైతులకు రైతు భరోసా వేయరని, యూరియా ఇవ్వరని, సకాలంలో వరి ధాన్యం కొనుగోలు చేయరని ఎద్దేవా చేశారు. రైతులను అప్పుల పాలు చేస్తూ నిలువునా ముంచుతున్న ప్రభుత్వానికి అధికారంలో కొనసాగే అర్హత లేదన్నారు. తన సొంత నియోజకవర్గంలో వడ్ల కొనుగోలులో మంత్రి దామోదర రాజనర్సింహ విఫలం చెందారన్నారు. తూకాలు సక్రమంగా నిర్వహించి, దళారుల దోపిడీని అరికట్టాలని, కొనుగోలు కేంద్రాల్లో ఉన్న వడ్లను ఏలాంటి తరుగు లేకుండా వెంటనే మద్దతు ధరతో ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలోని ఖాళీ కుర్చీకి రైతులతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంటి ప్రభు, వివిధ గ్రామాల సర్పంచులు, రైతు సంఘాల నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# SC బస్తీ స్మశానవాటిక అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- భారతి నగర్ డివిజన్‌లో రూ.25 లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం
- PAC చైర్మన్ ఆరెకపూడి గాంధీ చేతుల మీదుగా శంకుస్థాపన
- స్మశానవాటికను ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేస్తామని వెల్లడి
- నాణ్యతలో రాజీ పడొద్దని అధికారులకు సూచన

**రామచంద్రపురం, మే 23 (సిరి న్యూస్):**



భారతి నగర్ డివిజన్ పరిధిలోని MIG కాలనీలో రూ.25 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న నల్లగండ్ల SC బస్తీ స్మశానవాటిక అభివృద్ధి, సుందరీకరణ పనులకు PAC చైర్మన్ ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే తమ ధ్యేయమన్నారు. MIG కాలనీలోని నల్లగండ్ల SC బస్తీ స్మశానవాటికను ఆధునిక వసతులతో అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు.స్మశానవాటికలో స్నానపు గదులు, అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేయడంతో పాటు ప్రశాంత వాతావరణం కల్పిస్తామని చెప్పారు. అంత్యక్రియలు సజావుగా నిర్వహించుకునేలా అన్ని సదుపాయాలు కల్పిస్తామని పేర్కొన్నారు. పనులను నాణ్యత ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో, మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని గాంధీ తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు నిరంతరం కృషి చేస్తానని చెప్పారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, మహిళలు, కాలనీ వాసులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నమస్తే ఎమ్మెల్యే సార్..

**చింతకు చిన్నారుల ఆత్మీయ పలకరింపు**

**పిల్లలతో సరదాగా ముచ్చటించిన సంగారెడ్డి ఎమ్మెల్యే**

**చదువుతో పాటు సంస్కారం ముఖ్యమని సూచన**

**ప్రజాప్రతినిధి ఆత్మీయతపై స్థానికుల హర్షం వ్యక్తం**

**సంగారెడ్డి, సిరి న్యూస్:**



సంగారెడ్డి శాసనసభ్యులు చింత ప్రభాకర్ ను వారి క్యాంపు కార్యాలయంలో శనివారం పలువురు చిన్నారులు ఆత్మీయంగా కలిశారు. ఎమ్మెల్యేను చూడగానే ఎంతో ఉత్సాహంగా 'నమస్తే ఎమ్మెల్యే సార్' అంటూ ఆప్యాయంగా పలకరించారు. చిన్నారుల అమాయకపు అభివాదానికి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అంతే ఆత్మీయంగా, చిరునవ్వుతో స్పందిస్తూ వారితో సరదాగా ముచ్చటించారు. ఈ సందర్భంగా చిన్నారుల చదువులు, వారి పాఠశాల విశేషాలు మరియు ఇష్టాఇష్టాల గురించి ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి మంచి విద్యతో పాటు పెద్దల పట్ల గౌరవం, సంస్కారం కూడా ఎంతో ముఖ్యమని పిల్లలకు సూచించారు. నిరంతరం ప్రజలతో బిజీగా ఉండే ప్రజాప్రతినిధి, చిన్న పిల్లలతో ఎంతో ఆత్మీయంగా కలిసిపోయి మాట్లాడటం చూసి అక్కడ ఉన్న స్థానికులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు. ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, అందరినీ కలుపుకుపోయే ప్రజా నాయకుడిగా ఎమ్మెల్యే వ్యవహరిస్తున్నారని స్థానికులు కొనియాడారు.

# అందోలు చెరువు అభివృద్ధికి మరిన్ని నిధులు

**ఇరిగేషన్ అధికారులకు మంత్రి దామోదర ఆదేశాలు**

**చెరువును పరిశీలించిన అధికారులు**



**జోగిపేట,మే 23, సిరిన్యూస్ః**

అందోలు పెద్ద చెరువు ఎడమవైపున జోగిపేట పట్టణ ప్రజలకు ఉపయోగకరమయ్యేలా మరో ధోబీఘాట్ నిర్మాణం, చెరువు కట్ట రివిట్‌మెంట్ పనులకు సంబంధించి ప్రతిపాదనలు సిద్దం చేయాలని మంత్రి దామోదర్ ఆదేశించడంతో శనివారం జోగిపేట మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లు ఎస్.కృష్ణారెడ్డి, చిట్టిబాబు, ఇరిగేషన్ ఏఈ మజహర్ అలీ, మంత్రి వ్యక్తిగత పీఏ హన్మాండ్లుతో కలిసి పరిశీలించారు. గతంలో మున్సిపల్ పరిధిలోని అందోలు వైపు ఘాట్ నిర్మాణం జరిగిందని, జోగిపేట ప్రాంత మహిళలు బతుకమ్మలు వదులు కునేందుకు ఘాట్ లేకపోవడంతో ఇబ్బందిగా ఉండడాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్లు ఏఈ తెలిపారు. ఇది వరకే అందోలు పెద్ద చెరువు కట్టపై సీసీ రోడ్డు, బట్టర్ ఫ్లై లైట్లు, హరిత హోటల్ వంటివి ఏర్పాటు చేసేందుకు అవసరమైన నిధులను మంత్రి దామోదర్ మంజూరు చేయించారని మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లు తెలిపారు. ప్రస్తుతం కట్టపై సీసీ రోడ్డు పనులు కొనసాగుతున్నాయన్నారు. సుందరీకరణ పనులు పూర్తయితే అందోలు చెరువు కట్ట రూపురేఖలు మారుతాయన్నారు. మున్సిపల్ కమిషనర్ రవీందర్, ఇరిగేషన్ శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ నాగరాజ్‌లు వారి వెంట ఉన్నారు.

# పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేస్తా

**భారతీయ జనతా పార్టీ మండల కన్వీనర్ గా బాలా గౌడ్**



**వెల్దుర్తి, మే 23, (సిరి న్యూస్) :**

భారతీయ జనతా పార్టీ వెల్దుర్తి మండల కన్వీనరు గా హనుమాద్రి బాలా గౌడ్ ను నియమిస్తూ శనివారం జరిగిన మీడియా సమావేశంలో మెదక్ జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్ గౌడ్ ప్రకటించారు.ఈ సందర్భంగా జిల్లా పార్టీ అధ్యక్షుడు నియామక పత్రం అందచేశారు.అనంతరం బాలా గౌడ్ మాట్లాడుతూ ఈ నియామకానికి సహకరించిన మెదక్ ఎంపీ రఘునందన్ రావు, పార్టీ అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, ఉపాధ్యక్షులు భుచేష్ యాదవ్, రమేష్ గౌడ్, మురళి యాదవ్, శ్రీనివాస్ గౌడ్ వెల్దుర్తి గ్రామ సర్పంచ్ దండెం ఆదర్శ్ కు,తనకు బాధ్యతలు అప్పగించిన భారతీయ జనతా పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, ముఖ్యంగా పేద ప్రజల అభ్యున్నతికి అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు.పార్టీ కార్యక్రమాలను గ్రామ స్థాయి వరకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని, పార్టీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే తమ లక్ష్యమని తెలిపారు.

## రూ. 3.66 కోట్లతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



**అమీన్ పూర్ మే 23 సిరి న్యూస్**

అమీన్ పూర్ డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలో మూడు కోట్ల 66 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శనివారం నాయకులతో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధిలో రాజీ పడేదే లేదు అంటూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నాం, నిధుల కొరత అనేది రాకుండా అమీన్పూర్ జిహెచ్ఎంసి నీ రూపురేఖలు మారుస్తామని అన్నారు. ఆల్ రౌండ్ డెవలప్మెంట్ కేవలం రోడ్లు, డ్రైనేజీలే కాకుండా, తాగునీటి సరఫరా కమ్యూనిటీ హాల్ మరియు మౌలిక వసతుల శంకుస్థాపన చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహా గౌడ్, దేవానంద్ ముదిరాజ్, సుధాకర్ రెడ్డి, కృష్ణ, ఉపేందర్రెడ్డి, మహాదేవ రెడ్డి, ప్రమోద్ రెడ్డి ,బిజిలి రాజ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## రాంసానిపల్లి శివారులో విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

### విద్యుత్ శాఖ నిర్లక్ష్యమే కారణం

**జోగిపేట, మే 23, (సిరి న్యూస్):**



విద్యూత్ షాక్‌తో ఓ ఎద్దు మృతి చెందిన ఘటన అందోల్ మండల పరిధిలోని రాంసాన్‌పల్లి గ్రామ శివారులోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద శనివారం జరిగింది. టేక్మాల్ మండల పరిదిలోని కుసంగి గ్రామానికి చెందిన నాగమొల్ల శ్రీశైలం అనే రైతుకు చెందిన ఓ ఎద్దు శనివారం ఉదయం 10 గంటల సమయంలో తప్పిపోయి రాంసాన్‌పల్లి వైపు వచ్చింది. దీంతో వెంటనే బాధిత రైతు తన తప్పిపోయిన ఎద్దు కోసం వెతుకుతుండగా రాంసాన్‌పల్లి గ్రామ శివారులో కంచెలేకుండా ఏర్పాటుచేసిన ట్రాన్సుఫార్మర్ వద్ద విద్యుత్ షాక్‌కు గురై మృతి పడి ఉండడాన్ని గుర్తించారు. దీంతో బాధిత రైతు చనిపోయిన తన ఎద్దును చూసి బోరున విలపించాడు. మృతి చెందిన ఎద్దు విలువ రూ.80 వేల వరకు ఉంటుందని ఆవేదన వ్యక్తం చేసాడు. నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు ప్రభుత్వాన్ని కోరారు. కంచెలేకుండా కనీసం మోకాలి ఎత్తులో కూడా లేని ట్రాన్స్‌ఫార్మర్ ఉండడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని, దీంతో అటువైపుగా పంట పొలాలకు వెళ్లే రైతులకు ప్రమాదం పొంచి ఉందని తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## 14-15 వయసు బాలికలు హెచ్ పి వి వ్యాక్సిన్ వేసుకోవాలి



**నర్సాపూర్ మే 23, (సిరి న్యూస్):**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం పురపాలక సంఘం కార్యాలయం నందు చైర్ పర్సన్ లక్ష్మి రాజు యాదవ్ అధ్యక్షతన, కమిషనర్ చెరుకు సాయికుమార్ , పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా ఆధ్వర్యంలో కిషోర్ బాలికల హెల్త్ స్క్రీనింగ్ కార్యక్రమం నిర్వహించారు 31 మంది కిషోర్ బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. 14-15 వయసు బాలికలు తప్పకుండా హెచ్ పి వి వ్యాక్సిన్ చేయించుకోవాలని, పౌష్టికాహారం తీసుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో TMC దేవపాల స్థానిక వైద్యులు డా.సునీత మెప్మా ఆర్పీలు, ఆశా వర్కర్లు పాల్గొనడం జరిగింది.

## కార్మికుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

### ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం



**వెల్దుర్తి, మే 22,(సిరి న్యూస్):**

ఒక కోటి 11 లక్షల మంది కార్మికులకు కనీస వేతనాలు పెంచుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయానికి వెల్దుర్తి మండల కార్మికులు కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి ★రేవంత్ రెడ్డి, చిత్రపటానికి వెల్దుర్తి మండల కార్మికులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాలాభిషేకం చేశారు.తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వమని మరోసారి రుజువు చేశారు. కార్మికుల కనీస వేతనాలను పెంచుతూ తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయం జూన్ 1 నుంచి అమలులోకి వస్తుందన్నారు.ఈ సందర్భంగా వెల్దుర్తి పట్టణంలో మండల అధ్యక్షుడు మహేష్ రెడ్డి, ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి, చిత్రపటానికి పాలభిషేకం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మండలంలోని కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# కెమెరా కన్ను పడింది దొంగల స్రాక్ప్ ముగిసింది

- చిక్కారు దొంగలు దొరికింది బంగారం
- ఆ ఒక్క విజువల్ ఖరీదు అరకేజీ బంగారం
- 15 రోజుల్లోనే దొంగల గుట్టురట్టు
- రూ.50 లక్షల బంగారం రికవరీ
- తాళం వేసిన ఇల్లే టార్గెట్
- బుద్ధి మారలేదు దొంగతనం మానలేదు
- 22వ కేసుతో జైలు ఊచలు
- బాధితుల చెంతకు అరకేజీ బంగారం
- స్వయంగా అందజేసిన ఏసిపి శ్రీనివాస్



**అమీన్ పూర్ మే 23 సిరి న్యూస్**

ఆమీన్ పూర్ జిహెచ్ఎంసి సర్కిల్ పరిధిలోని బంధం కొమ్ము హిల్ టాప్ హోమ్స్ కాలనీలో నివసిస్తున్న వెంకట రమణ, భవాని అనే దంపతులు వారి ఇంట్లో గత నెల 14వ తేదీన 50 లక్షల విలువైన సొమ్ము అపహరణ! సమయం చూసి స్కెచ్ బాధితుల కుటుంబ సభ్యులు ఇంట్లో లేని సమయాన్ని , ఇల్లు తాళం వేసి ఉండటానికి గమనించిన దుండగుడు పక్కా ప్లాన్ తో లోపలికి చొరబడ్డారు. ఇంట్లో దాచి ఉంచిన దాదాపు రూ.50 లక్షల విలువచేసే అరకేజీ బంగారం దోచుకెళ్లారు. వెంటనే బాధితులు అమీన్ పూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

**సీసీ కెమెరానే కింగ్ మేకర్:**

బంధం కొమ్ము హిల్ టాప్ హోమ్స్ కాలనీలో జరిగిన భారీ దొంగతనం, కేసులో సీసీ కెమెరా ఇచ్చిన క్లూజ్ తో రంగంలోకి దిగిన అమీన్పూర్ క్రైమ్ టీం దొంగ దారి,మల్లించే లోపే అతన్ని స్థావరాన్ని ముట్టడించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. **15 రోజుల సుదీర్ఘ వేట:** ఆ ఒక్క క్లూస్ ఆధారంగా పోలీసులు రాత్రింబవళ్లు,శ్రమించి నిందితుడిని ప్రయాణ మార్గాన్ని అతని నెట్వర్క్ జల్లెడ పట్టారు. కంటిమీద కునుక్కు లేకుండా సరిగ్గా 15 రోజుల్లోనే దొంగను పక్కా స్కెచ్ తో లాక్ చేశారు.

**నగదు నగలు సురక్షితం:**

నిందితుడిని విచారించగా దొంగలించిన అరకేజీ బంగారని దాచిన చోటును ఒప్పేసుకున్నాడు. దీంతో పోలీసులు ఎలాంటి ఆలస్యం లేకుండా 50 లక్షల విలువ అయిన బంగారాన్ని సురక్షితంగా రికవరీ చేశారు.ఖేల్ కతం సీసీ కెమెరా ఇచ్చిన షాక్కు దొంగలించిన అరకేజీ బంగారానికి కక్కిన నిందితుడు.

**ఏ సి పి శ్రీనివాస్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ**

టెక్నాలజీ ప్రాధాన్యతపై సందేశం నేటి కాలంలో నేరాల నియంత్రణకు చేతనకు సీసీ కెమెరాలు మూడో కన్నుల పనిచేస్తు న్నాయని తెలిపారు . కాలనీవాసులు భద్రత విషయంలో నిర్లక్ష్యం వహించకుండా కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. మహబూబ్ నగర్ కిలాడి శివ ఆట ముగిసింది అతనిపై ఇప్పటికే చాలా కేసులు ఉన్నాయి, ఈ కేసుతో 22 వ కేసు నమోదు చేసి జైలుకు పంపియడం జరిగిందని తెలిపారు. ఈ మీడియా సమావేశంలో సిఐ నరేష్, క్రైమ్ టీం సిఐ సత్యనారాయణ, దశరథ్, మహేష్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు





**తూప్రాన్ మే 23 సిరి న్యూస్**

తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం శనివారం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత వ్యవసాయంలో వరి పంటకు ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో పండించే ఉద్యాన పంటలైన ఆయిల్ ఫామ్ కూరగాయల పంటలను సాగు చేసుకోవాలని సూచించారు ఈ సంవత్సరం తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని తెలిపారు శాస్త్రవేత్త డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ వరి పంట కోసిన తర్వాత వచ్చిన వరిగడ్డిని తగలబెట్టకుండా వరి పొలంలోనే ముక్క పెట్టి దున్నుకోవడం వల్ల సేంద్రియ ఎరువుగా మారి అధిక దిగుబడులు వస్తాయని రైతులకు సూచనలు ఇచ్చారు మండల వ్యవసాయ అధికారి గంగుమల్లు మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా పచ్చరొట్ట జిప్సంను సబ్సిడీ ద్వారా రైతులకు అందుబాటులోఉంచడం జరిగింది రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు గ్రామ సర్పంచ్ గొల్లపల్లి సంతోష్ రెడ్డి మాట్లాడుతూ శాస్త్రవేత్తలు ఇచ్చిన సలహాలు సూచనల మేరకు మార్కెట్లలో అధికంగా లాభదా యకంగా ఉన్న పంటలను ఆరుతడి కూరగాయ పంటలను పండించుకుని లాభాలు గడించే విధంగా రైతులు వరి పంటనే కాకుండా శాస్త్రవేత్తలు ఇచ్చిన సలహాలు సూచనలు నేర్చుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ విజయ నవీన్ గ్రామ రైతులు మహిళా రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు

# రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే ఏకైక లక్ష్యం

- దేశానికి అంబేద్కర్ రాసిన రాజ్యాంగమే శ్రీరామరక్ష
- మోదీ హయాంలో పెరిగిన దేశ అప్పులు
- కాంగ్రెస్‌కు 300కు పైగా సీట్లు అందించాలి
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**సంగారెడ్డి, సిరి న్యూస్:**

దేశ భవిష్యత్తు, ప్రజాస్వామ్య పరిరక్షణే ధ్యేయంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ముందుకు సాగుతు న్నారని, ఆయనను ప్రధానమంత్రిని చేయడమే దేశ ప్రజల తక్షణ కర్తవ్యమని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ ఎత్తుకున్న సంవిధాన్ బచావో నినాదం అత్యంత కీలకమైనదన్నారు. మహాభారతంలో కర్ణుడికి కవచకుండలాలు ఎలాంటి రక్షణ ఇచ్చాయో, భారతదేశంలో సామాన్య ప్రజలకు రాజ్యాంగం అలాంటి రక్షణ కల్పిస్తోందని, దాన్ని కొల్లగొట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. గతంలో ఇందిరా గాంధీ బ్యాంకులను జాతీయం చేసి పేదలను ఆదుకోగా, రాజీవ్ గాంధీ ఐటీ విప్లవానికి బీజం వేసి యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించారని గుర్తుచేశారు. గాంధీ కుటుంబం దేశం కోసం ప్రాణత్యాగాలే చేసిందని కొనియాడారు. 2014కు ముందు దేశ అప్పు రూ. 54 లక్షల కోట్లు ఉంటే, మోదీ పాలనలో అది రూ. 147 లక్షల కోట్లకు చేరిందని మండిపడ్డారు. బీజేపీ మతం పేరుతో, దొంగ ఓట్లతో అధికారంలోకి వస్తోందని విమర్శించారు. తాము రాముడి పేరుతో ఓట్లు అడగమని, సీతారామ కళ్యాణాన్ని బ్రహ్మాండంగా నిర్వహిస్తానని సవాల్ విసిరారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను 300కు పైగా స్థానాల్లో గెలిపించాలని కోరారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగిపోవాలన్నా, ప్రత్యేక హోదా మరియు పోలవరం ప్రాజెక్టు పూర్తి కావాలన్నా రాహుల్



గాంధీ ప్రధాని కావాలని, చంద్రబాబు లేదా జగన్ వల్ల ఇది సాధ్యం కాదని స్పష్టం చేశారు. మోదీ అహంకారానికి కాలమే సమాధానం చెబుతుందని జగ్గారెడ్డి హెచ్చరించారు.

# నల్లవల్లిలో నేటి నుంచి శ్రీ మల్లన్న జాతర మహోత్సవాలు

**గుమ్మడిదల, మే 23 (సిరి న్యూస్):**

గుమ్మడిదల మండల పరిధిలోని నల్లవల్లి గ్రామంలో శ్రీ మల్లికార్జున స్వామి జాతర మహోత్సవాలు ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు నల్లవల్లి దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. జాతర సందర్భంగా ఆదివారం సాయంత్రం స్వామివారి గంగా పతనం కార్యక్రమాన్ని మల్లన్న దేవాలయం నుంచి గ్రామ చెరువు



వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. 25 న మధ్యాహ్నం శ్రీ మల్లికార్జున స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా జరగనుండగా, అనంతరం అగ్నిగుండాల కార్యక్రమం, స్వామివారికి బోనాల సమర్పణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 26 న నాగవెల్లి కార్యక్రమంతో పాటు ఒగ్గు కథ, కొండ పోచమ్మ బోనాల కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ వెల్లడించింది. గ్రామ ప్రజలతో పాటు మండల ప్రజలందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని దేవాలయ కమిటీ సభ్యులు కోరారు.

# దాంపత్య జీవితంలో జంటలు చేసే తప్పులివే..

**దాంపత్య జీవితం అనేది ప్రతి ఒక్కరి జీవితంలో చాలా ముఖ్యమైన భాగం. ప్రతి ఒక్కరికి ఇది చాలా కీలకం కూడా. జీవితం ఎన్ని సమస్యలు విసిరినా జీవిత భాగస్వామి మద్దతుగా ఉంటూ సహకరిస్తే సప్త సముద్రాలైనైనా దాటేయొచ్చని కొందరు నిపుణులు చెప్తున్నారు. అదే దాంపత్య జీవితంలో చిన్న సమస్య మొదలైనా అది జీవితం మొత్తంపై తీవ్ర ప్రభావం చూపుతుందని చెప్తున్నారు. ఈ క్రమంలోనే ప్రస్తుత కాలంలో దంపతలు మధ్య అనేక సమస్యలు వస్తున్నాయని, అవి విడాకుల వరకు తీసుకెళ్తున్నాయని నిపుణులు చెప్తున్నారు. నిజంగా అవి విడిపోవాల్సినంత పెద్ద సమస్యలు కూడా కావాలని, చాలా సందర్భాల్లో చిన్నచిన్న సమస్యలనే దంపతులిద్దరూ పెద్దది చేసుకుంటున్నారని చెప్తున్నారు. ఈ నేపథ్యంలోనే అసలు దాంపత్య జీవితంలోకి అడుగు పెట్టిన తర్వాత దంపతులు చేస్తున్న తప్పల గురించి వివరించారు. అంతేకాకుండా ఈ చిన్న చిన్న సమస్యలు కాస్తా తీవ్రతరం కావడం భార్యభర్తలు విడిపోతున్న ఘటనలు రోజురోజుకు అధికం అవుతున్నాయి. ఇవి యువతపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని, వీటి కారణంగానే ప్రస్తుతం యువతలో చాలా మంది పెళ్లి చేసుకోవడానికి ఏమాత్రం ఆసక్తి చూపడం లేదని నిపుణులు చెప్తున్నారు. పైగా కొందరు పెళ్లి మాట ఎత్తితేనే చిరాకు, భయం, ఆందోళనకు చెందుతున్నట్లు కూడా నిపుణులు అంటున్నారు. అయితే వైవాహిక జీవితంలో సమస్యలు రావడం సహజమని, దానిని చూసి యువత ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్తున్నారు. వైవాహిక జీవంతో తరచుగా కొన్ని తప్పలు జరుగుతంటాయని, వాటిని నివారించుకుంటే వైవాహిక బంధం బలంగా ఉంటుందని వైద్యులు అంటున్నారు. ఇంతకీ దాంపత్య జీవితంలో తరచుగా దంపతులు చేసే తప్పలేంటంటే..**



### అభిప్రాయ బేధాలు

ఇద్దరు వ్యక్తుల మధ్య అభిప్రాయ బేధాలు రావడం సర్వసహజం. ప్రతి ఇద్దరి మధ్య ఏదో ఒక అంశంలో అభిప్రాయ విబేధాలు వస్తుంటాయి. ఇద్దరు వేరు వేరు ఆలోచనలున్న వ్యక్తులు కలిసి ఉన్నప్పుడు అభిప్రాయ భేదాలు రావడం సహజం. ఇలాంటి సందర్భంలో కూర్చుని మాట్లాడి పరిష్కరించుకోవాలి. పరస్పరం ఇద్దరూ సామరస్యంగా ఉంటే వారి సంబంధం కూడా బాగుంటుంది. సంబంధంలో ప్రేమ, స్నేహాన్ని పెంపొందించుకోవాలి.

### నమ్మకాన్ని పెంచుకోవాలి

వివాహ బంధానికి నమ్మకం పునాది లాంటిది. దాంపత్య జీవితంలో ఒకరు మరొకరిపై అధికారం చెలాయించడం సరైనది కాదు. బంధం బలంగా ఉండాలంటే ఇలాంటి మనస్తత్వాన్ని వదిలేయండి. పరస్పరం నమ్మకాన్ని పెంపొందించుకోండి. మీ భాగస్వామికి స్వేచ్ఛనివ్వండి, వారి భావాలను కూడా గౌరవించండి. అలాగైతేనే ఇది ఆరోగ్యకరమైన సంబంధం అవుతుంది.

### ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దు

మీ భాగస్వామి ఆరోగ్యాన్ని మీరు చూసుకోవాలి నిజమే, కానీ దాని కన్నా ముఖ్యమైది మీ ఆరోగ్యాన్ని మీరు చూసుకోవడం. మీ వివాహంతో పాటు, పాత అలవాట్లు, స్నేహితులు, వ్యక్తిగత ఉద్యోగం, అవకాశాలను వదులుకోకండి. ఇది మానసికంగా మిమ్మల్ని దెబ్బతీస్తుంది. దీని తాళూకా ఒత్తిడి మీ బంధాన్ని కచ్చితంగా ప్రభావితం చేస్తుంది.

### ఓపెన్‌గా మాట్లాడుకోండి

ఏది ఉన్నా మనసువిప్పి మాట్లాడుకోవడం ద్వారా 90శాతం సమస్యలు సమసిపోతాయి. అలా కాకుండా ఒక విషయాన్ని మనసులో దాచుకుంటే అది మరిన్ని సమస్యలకు దారితీస్తుంది. దంపతలు మధ్య దూరాన్ని పెంచుతుంది. మనస్పర్థలు రాకుండా ఉండాలంటే మీ భాగస్వామికీ మీకూ మధ్య ఓపెన్ , నిజాయితీ కమ్యూనికేషన్ ఉండేలా చూసుకోండి. మనసారా ఇద్దరూ మాట్లాడుకోండి, చర్చకు ప్రాధాన్యత ఇవ్వకపోతే ఇద్దరి మధ్య దూరం ఏర్పడుతుంది. కాబట్టి ఎల్లప్పుడూ ఫ్రీగా మాట్లాడుకుంటూ సంతోషంగా ఉండండి.

### సమయం కేటాయించడం ముఖ్యం

పని ఒత్తిడి రోజూ ఉంటుంది. కానీ ఆ ఒత్తిడి మన వ్యక్తిగత జీవితంపై ప్రభావం చూపకుండా చూసుకోవాలి. పని ఒత్తిడిని కారణంగా చూపిస్తూ జీవిత భాగస్వామికి తగిన సమయం ఇవ్వకుండా ఉండకూడదు. జీవిత భాస్వామికి మనం కేటాయించే సమయమే ఇద్దరి మధ్య బంధాన్ని బలపరుస్తుంది. జీవనశైలి సమస్యల వల్ల పరస్పరం కలిసి ఉండటానికి సమయం లేదు అనిపించచ్చు. కానీ ఇది మీ వైవాహిక జీవితానికి ఎంత మాత్రం మంచిది కాదు. పరస్పరం ప్రత్యేకంగా సమయం కేటాయించుకోకపోతే భావాలను పంచుకోలేరు, మనసారా మాట్లాడుకోలేరు. ఇది బంధానికున్న విలువను తగ్గించేస్తుంది. స్పర్థలు పెరిగి గొడవలు, చికాకులకు దారితీస్తుంది.

### సమ్యలను కలిసి పరిష్కరించుకోండి..

సమస్యలు ప్రతి ఒక్కరికి ఉంటాయి. వీటిని నీవి, నావి అని వేరు చేయకుండా మనవి అన్న ధోరణితో ముందుకు వెళ్లండి. సమస్యలో ఎవరిది ఒప్పు అని వాగ్వాదం చేసే బదులు ఆ సమస్యను ఎలా పరిష్కరించాలని ఆలోచించండి. జీవితంలో చాలా ఎత్తుపల్లాలు ఉంటాయి. కొన్నిసార్లు పెద్ద పెద్ద సమస్యలు వచ్చి పడతాయి. అటువంటి సందర్భాల్లో ఒకరిని ఒకరు నిందించుకోవడం మంచిది కాదు. బదులుగా అటువంటి సందర్భాలను కలిసి ఎదుర్కోండి. పరస్పర సహకారంతో ఇబ్బందుల నుంచి బయటపడండి.

### పరిమితులను గౌరవించండి


వివాహం అయ్యాక భాగస్వామిగా వచ్చిన వెంటనే వారిపై పరిమితులు విధించడం సరైనది కాదు. ఇలా చేయడం వల్ల ఒత్తిడి ఏర్పడుతుంది. స్వేచ్ఛకు ఆటంకం కలుగుతుంది. వ్యక్తి ఇష్టాలు, అభిప్రాయాలకు అనుగుణంగా పరిమితులను గుర్తించి ముందుకు సాగితే మంచిది.

### రొమాన్స్ ఉండనివ్వండి

వివాహం అయిన తర్వాత ఆనందం, ప్రేమ ఎల్లప్పుడూ ఇద్దరిలోనూ ఉండాలంటే భాగస్వామితో కాస్త రొమాంటిక్‌గా ఉండటం మర్చిపోకండి. అలాగే, సర్‌ప్రైజ్‌లు ఇవ్వడం కూడా ఆపకండి. అప్పుడప్పుడూ అయినా వారికి తెలియకుండా క్యాండిల్ లైట్ డిన్నర్ వంటి వాటిని ప్లాన్ చేయండి. భాగస్వామికి ఆనందంగా ఉంచేందుకు మీ వంతు ప్రయత్నం చేయడం మానుకోకండి.

### ప్రాధాన్యతలు ఇవ్వండి

ఎలాంటి భావం కలిగినా కూడా దాన్ని పంచుకునేందుకు మీ భాగస్వామికి మొదటి ప్రాధాన్యతగా ఉండనివ్వండి. సంతోషకరమైన విషయమైనా, భాగస్వామికే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని గుర్తుంచుకోండి. అన్నీ వారితో పంచుకోవడం వల్ల మీ వివాహ జీవితం సంతోషకంగా ఉంటుంది.





# ఇట్టే బరువు తగ్గించే సూపర్ సూప్

అధిక బరువు ప్రస్తుత యువతలో అధికశాతం మందిని ఇబ్బంది పెడుతున్న సమస్య. బిజీ లైఫ్ స్టైల్ కారణంగానో, అనారోగ్యకరమైన ఆహార అలవాట్ల వల్లో అధికబరువు పెరగడం ప్రస్తుతం యువతలో అధికంగా కనిపిస్తోంది. ఇందుకు ప్రధాన కారణం జంక్ ఫుడ్ అని వైద్యులు చెప్తున్నారు. వీరిలో చాలా మంది బరువు తగ్గడం కోసం ఎన్ని ప్రయత్నాలు చేసిన ఫలితాలు మాత్రం శూన్యంగానే కనిపిస్తుంటాయి. నెలల పాటు వారు ప్రయత్నాలు చేసినా బరువులో ఎటువంటి మార్పు రాకపోవడంతో చాలా మంది యువత బరువు తగ్గాలన్న ఆలోచనను విరమించుకుంటారు. ఇక తమ బతుకు ఇంతే అన్నట్లు నిరాశ, నిస్పృహల్లోకి వెళ్లిపోతారు. అంతేకాకుండా ఈ అధికబరువు సమస్య యువతలో అనేక వ్యాధులకు దారితీస్తోంది. చిన్న వయసులోనే గుండె జబ్బులు రావడానికి కూడా ఇదే ప్రధాన కారణంగా వైద్యులు చెప్తున్నారు. సరైన వ్యాయామం చేయడానికి కూడా ఈ అధిక బరువు వల్ల శరీరం సహకరించడం లేదని, దాని వల్ల కూడా యువతలో అనేక రకాల సమస్యలు వస్తున్నాయని చెప్తున్నారు. ఇలాంటి వారికి ఆరోగ్య నిపునులు ఒక సూప్‌ను సజెస్ట్ చేస్తున్నారు. ఈ సూప్ తాగడం ద్వారా ఎంత బరువైన ఇట్టే తగ్గిపోవచ్చని, బరువు తగ్గడానికి ప్రయత్నిస్తున్నవారికి ఇదొక వరంలా పనిచేస్తుందని నిపుణులు వివరిస్తున్నారు. మరి ఆ సూపర్ సూప్ ఏంటో? ఎలా చేసుకోవాలో ఒకసారి చూసేద్దామా..


### సూప్ రెసిపీ

1.4 మిలియన్లకు పైగా యూట్యూబ్ సబ్ స్కైబర్స్ ఉన్న డైటీషియన్ నటాషా మోహన్ ఇటీవల ఇన్ స్టాగ్రామ్ లో 'డిన్నర్ రెసిపీ'ని పోస్ట్ చేశారు. ఈ సూప్ వల్ల బరువు తగ్గవచ్చని ఆమె వివరిస్తున్నారు. ఈ వీడియోలో పనీర్ క్యూబ్స్ ను, క్యారెట్, గ్రీన్ బీన్స్, బచ్చలికూర, పుట్టగొడుగులు వంటి కూరగాయలతో పాటు తరిగిన వెల్లుల్లి, ఓట్స్, నీరు కలిపి ఈ సూప్ తయారుచేశారు. ఈ సూప్ లో సోయా సాస్, తాజా కొత్తిమీర ఆకులను కూడా జోడించి ఎంతో రుచిగా దీని వండవచ్చు.

డిన్నర్ కోసం ఈ సూప్ తయారుచేసుకుని తింటే ఆరోగ్యానికి ఎంతో మంచిది. మీకు తక్కువ సమయంలో బరువు తగ్గడానికి ఇది సహాయపడుతుంది. ఆరోగ్యకరమైన సూప్ వంటకాలతో మాత్రమే వేగంగా బరువు తగ్గడం అసాధ్యం కాదు, కొన్ని వ్యాయామాలు కూడా చేయాల్సి ఉంటుంది. కొవ్వు పట్టే ఆహారాలు తినడం తగ్గించాలి. గ్రేటర్ నోయిడాలోని యథార్థ్ హాస్పిటల్ న్యూట్రిషన్ అండ్ హెల్త్ విభాగాధిపతి డాక్టర్ కిరణ్ సోని, బరువు తగ్గడానికి సూప్ రెసిపీ ప్రభావవంతంగా పనిచేస్తుందని, సురక్షితం కూడా అని వెల్లడించారు.

### ఇలా బరువు తగ్గొచ్చు..

ఒక వ్యక్తి బరువు సుమారు 90100 కిలోలు ఉంటే, వేగంగా బరువు తగ్గడం సాధ్యమే. వారి శరీరంలోని నీరు త్వరగా కరిగిపోతుంది. కానీ ఒక వ్యక్తి 70 కిలోల బరువు ఉండి, రాత్రి భోజనానికి సూప్ తినడం వల్ల మాత్రం బరువు తగ్గడం నెమ్మదిగా మారుతుంది. కాబట్టి కొవ్వు అధికంగా ఉండే ఆహారాలు తినడం మానేసి, నడక వంటి వ్యాయామాలు చేస్తూ ఇక్కడిచ్చిన సూప్ తాగడం వల్ల 3 కిలోలు తగ్గవచ్చు. బరువు తగ్గడం అనేది బరువు, ఎత్తు, జీవక్రియ రేటుపై ఆధారపడి ఉంటుంది. స్థూలకాయం ఉన్నవారితో పోలిస్తే ఎక్కువ కండరాలు ఉన్నవారు వేగంగా బరువు తగ్గవచ్చు. కేలరీల తీసుకోవడం తగ్గించడం ద్వారా, వేగంగా బరువు తగ్గవచ్చని డాక్టర్ కిరణ్ సోనీ తెలిపారు.ఇది కాకుండా రాత్రి భోజనం రాత్రి 7 గంటలకే పూర్తి చేయాలి. ఈ సూప్ ను రాత్రి పూట భోజనానికి బదులు తింటే బరువు త్వరగా తగ్గవచ్చు. బరువు తగ్గడం కష్టమైన ప్రయాణం కావచ్చు, కానీ ప్రారంభిస్తేనే ఎంతో కొంత ఫలితం కనిపిస్తుంది. బరువు తగ్గేందుకు సమతులాహారం తీసుకోవాలి. పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, సన్నని ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. ఒకేసారి అతిగా తినకుండా రోజులో కొంచెం కొంచెం ఆహారం తినడం అలవాటు చేసుకోవాలి. చక్కెర నిండిన ఆహారాలు, ఫాస్ట్ ఫుడ్స్, అధిక కేలరీల పానీయాలు తీసుకోవడం తగ్గించండి.




# ఈ ఆహారాలతో మగతనానికి దెబ్బ

**ప్రస్తుత సమాజంలో పురుషులను మానసికంగా దెబ్బతీస్తున్న సమస్య ఇన్‌ఫెర్టిలిటీ. పెళ్ళి అయ్యి ఏళ్లు గడుస్తున్నా పిల్లలు పుట్టకపోవడం మగవారి కలచివేస్తోంది. వైద్యుల వద్దకు వెళ్తే పురుషుల్లోనే లోపం ఉందని చెప్తున్న కేసుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఇందులో వైద్యులు అనేక కారణాలు చెప్తున్నారు. ఎక్కవసేపు కూర్చునే ఉండటం, అధిక ఒత్తిడి ఇలా మరెన్నో కారణాలు ఉన్నాయని, వాటిలో ఆహార అలవాట్లు కూడా కీలక పాత్ర పోషిస్తున్నాయని చెప్తున్నారు వైద్యులు. ప్రస్తుత పరుగుల ప్రపంచలో వందమందిలో 80శాతం మంది వరకు ఈ సమస్యతో సతమతమవుతున్నారని అంటున్నారు వైద్యులు. ఈ కారణంగానే అనేక దాంపత్య బంధాలు పెళ్లైన కొన్నాళ్లకే తెగిపోతున్నాయని చెప్తున్నారు. కాగా.. కొన్ని మార్గాల ద్వారా పురుషులు ఈ సమస్యల నుంచి బయటపడొచ్చని, తమ మగతన సమస్యను పరిష్కరించుకోవచ్చని సూచిస్తున్నారు వైద్యులు. సాధారణంగా మన తీసుకునే ఆహారం మన ఓవరాల్ ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. అందులో మగతనం కూడా ఒకటి. మన ఆహారపు అలవాట్ల వల్లే అధికశాతం పరుషులు ఇన్‌ఫెర్టిలిటీ సమస్యకు గురవుతున్నారని అంటున్నారు నిపుణులు. అయితే వారు తమ ఆహారంలో మార్పులు చేసుకోవడం ద్వారా ఈ సమస్యను దూరంచేసుకోవచ్చని చెప్తున్నారు. ముఖ్యంగా చాలా మంది పురుషులు తెలియక ఇష్టంగా తినే ఆహరలే ఈ సమస్యకు దారితీస్తాయని, ఈ సమస్య నుంచి బయట పడాలంటే ఆ ఆహారాలను దూరంగా పెట్టడం తొలి స్టెప్ అని వివరిస్తున్నారు. ఇంతకీ ఆ ఆహారేలేంటో తెలుసా..**

### సోడా, ఎనర్జీ డ్రింక్..

పంచదార ఎక్కువగా ఉండే సోడా, ఎనర్జీ డ్రింక్స్ కూడా మేల్ ఫెర్టిలిటీని దెబ్బతీస్తాయి. ఈ ఎనర్జీ డ్రింక్స్ వీర్యం నాణ్యతని దెబ్బతీస్తాయి. ఇలాంటి ఎనర్జీ డ్రింక్స్ తీసుకున్నప్పుడు మగవారిలో స్పెర్మ్ కౌంట్ ప్రాబ్లమ్స్ వస్తాయి. కేవలం సంతాన సమస్యే కాదు.. వీటిని తీసుకోవడం వల్ల ఇన్సులిన్ రెసిస్టెన్స్ పెరుగుతుంది. దీని వల్ల ఫెర్టిలిటీ సమస్య పెరుగుతుంది. ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ని పెంచుతుంది. అంతేకాకుండా, ఇన్‌ఫ్లమేషన్ తగ్గుతుంది. దీంతో హెల్త్ ప్రాబ్లమ్స్ తగ్గుతాయి.



### సోయా ప్రొడక్ట్స్ ..

సోయాతో తయారైన ఏ ప్రొడక్ట్స్ అయినా.. పాలు, టోఫు వంటి సోయా పదార్థాలన్నీ కూడా స్పెర్మ్ కౌంట్‌ని తగ్గిస్తాయి. సోయాలోని గుణాలు ఫెర్టిలిటీ అవకాశాలను తగ్గిస్తాయి. కాబట్టి, సోయా చంక్స్, పాలు, టోఫు వంటివాటిని అవాయిడ్ చేయడం మంచిది.

### ఎరువులతో పండించిన కూరగాయలు..

మనం తినే పండ్లు, కూరగాయలు ఏవైనా సరే నేటి కాలంలో ఎక్కువగా ఎరువులతో పండిస్తున్నారు. అందుకే, వీటిని తినేటప్పుడు శుభ్రంగా కడగడం మంచిది. అదే ఎరువులు, కాలుష్యం కాలువల్లో కలుస్తుంది. వీటిలో పెరిగే చేపల్ని వండిగా తినడం, క్యాన్స్‌లో ప్యాక్ చేసి అమ్మితే వాటిని కొనుక్కుని వాటిని తినడం వల్ల కూడా ప్రమాదం ఉంటుంది. వీటిని తీసుకోవడం సెర్మ్ కౌంట్ తగ్గే అవకాశం ఉంది. కేవలం ఇవే కాదు.. మనకి తెలియకుండా చేసే కొన్ని పనులు కూడా ఈ సమస్యకి కారణమవుతాయి. అందులో నాన్ స్టిక్ కుక్ వేర్ వాడడం. ఇందులోని నాన్‌స్టిక్ పెస్టిసైడ్స్‌లానే పనిచేస్తుంది.

### ప్రాసెస్డ్ మీట్..

రీసెంట్‌గా జరిగిన అధ్యయనాల ప్రకారం.. ప్రాసెస్డ్ మీట్స్ వంటి హాట్ డాగ్స్, బీఫ్ జర్కీ వంటి ప్రాసెస్డ్ మీట్ తినడానికి టేస్టీగా ఉన్నప్పటికీ వీటిని తీసుకోవడం వల్ల స్పెర్మ్ కౌంట్ తగ్గుతుంది. దీంతో పాటు పాటు ఇతర సమస్యలు కూడా వస్తాయి. ప్రాసెస్ చేసిన ఏ ఫుడ్స్ అయిన మగవారిలో వీర్యకణాల సంఖ్య తగ్గిస్తుంది. దీంతో సంతాన సమస్యలు తగ్గుతాయని నిపుణులు చెబుతున్నారు.

### హై ఫ్యాట్ డెయిరీ ప్రొడక్ట్స్ ..

ఫుల్ క్రీమ్ ఉన్న పాలు, అధిక కొవ్వు పాల ఉత్పత్తులు తీసుకోవడం వల్ల కూడా మగవారిలో సంతానోత్పత్తి తగ్గుతుంది. దీనికి కారణం స్పెర్మ్ కౌంట్ తగ్గడమే. అందుకే, పిల్లలకోసం ప్లాన్ చేసేవారు ఫుల్ క్రీమ్, జున్ను వంటివాటిని అవాయిడ్ చేయండి.

### శాచ్యురేటెడ్ ఫ్యాట్ ఫుడ్స్..

శాచ్యురేటెడ్ ఫ్యాట్స్ ఫుడ్స్ కూడా ఫెర్టిలిటీ అవకాశాలను తగ్గిస్తాయి. ఇవి ఎక్కువగా ఫాస్ట్ ఫుడ్, ప్రాసెస్డ్ సాల్టీ, స్వీటెన్డ్ ఫుడ్స్, రెడ్ మీట్స్ వంటి వాటిలో ఉంటాయి. ఈ ఫుడ్స్ ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ని, ఇన్‌ఫ్లమేషన్‌ని పెంచుతాయి. దీని వల్ల హెల్త్ ప్రాబ్లమ్స్, ఊబకాయం, టైప్ 2 డయాబెటిస్, ఇన్సులిన్ రెసిస్టెన్స్ వంటి సమస్యలు వస్తాయి. ఈ మెటబాలిక్ డిసార్డర్స్ అన్నీ కూడా స్పెర్మ్ క్వాలిటీ తగ్గడం, హార్మోన్ ప్రాబ్లమ్స్, ఇమ్యునిటీని దెబ్బతీస్తాయి. దీంతో సంతానలేమి సమస్యలు పెరుగుతాయి.







# ఏఐతో నకిలీ బికినీ ఫొటోలు

## నెట్టింట వైరల్ కావడంపై నటి రుక్మిణీ ఆగ్రహం

'సప్త సాగరాలు దాటి' సినిమాతో తెలుగు ప్రేక్షకులలో మంచి గుర్తింపు తెచ్చుకున్న కన్నడ నటి రుక్మిణి వసంత్‌కు సంబంధించిన కొన్ని బికినీ ఫొటో షూట్ క్లిప్స్ సోషల్ మీడియాలో విపరీతంగా కనిపించడంపై నటి రుక్మిణీ వసంత్ ఆగ్రహం చెందారు. గ్రీన్ కలర్ బికినీ ధరించి ఆమె స్విమ్మింగ్ పూల్‌లోకి దిగుతున్నట్లు ఉన్న ఈ విజువల్స్ నెటిజన్లను ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురిచేశాయి. చుట్టూ కెమెరాలు, టెక్నీషియన్లు ఉండటంతో ఇది ఏదైనా అధికారిక షూట్ అయ్యి ఉంటుందని కొందరు భావించగా, మరికొందరు మాత్రం ఇది ఏఐ డీప్‌ఫేక్ అయ్యి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తంచేశారు. అయితే ఈ వివాదంపై తాజాగా నటి రుక్మిణి వసంత్ అధికారికంగా స్పందిస్తూ ప్రకటన విడుదల చేశారు. ఇంటర్నెట్‌లో తన పేరిట సర్క్యులేట్ అవుతున్న బికినీ చిత్రాలన్నీ పూర్తిగా ఏఐ ద్వారా సృష్టించిన నకిలీ ఫొటోలని ఆమె స్పష్టం చేశారు. ఆ చిత్రాలు పూర్తిగా తప్పుడు సమాచారంతో, కల్పితంగా సృష్టించబడి నవని ఆమె పేర్కొన్నారు. బాధ్యతా రాహిత్యంగా ఇతరుల వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగిస్తూ ఇటువంటి మార్ఫింగ్ కంటెంట్‌ను తయారు చేయడం మరియు వాటిని వైరల్ చేయడం తీవ్రమైన నేరమని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారాన్ని తన టీమ్ చాలా తీవ్రంగా పరిగణిస్తోందని, ఈ ఫొటోలను సృష్టించిన వారిపై, అలాగే వీటిని సోషల్ మీడియాలో షేర్ చేస్తూ ప్రచారం కల్పిస్తున్న వారిపై సైబర్‌క్రైమ్ విభాగంలో ఫిర్యాదు చేసి కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోబోతున్నట్లు రుక్మిణి వెల్లడించారు. నెటిజన్లు ఎవరూ కూడా ఇటువంటి నకిలీ కంటెంట్‌ను ఇతరులకు షేర్ చేయవద్దని, వాటిని ప్రోత్సహించవద్దని ఆమె ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.




# నాగార్జునకు మే 23 స్పెషల్

## తొలి చిత్రం విక్రమ్ విడుదలై 23 ఏళ్లు

### తన జీవితంలో 'మే 23' ఎప్పటికీ ప్రత్యేకమేనని అగ్ర కథానాయకుడు నాగార్జున

అన్నారు. అందులోనూ ఈ ఏడాది మరీ స్పెషల్ అని తెలిపారు. తన మొదటి చిత్రం 'విక్రమ్' విడుదలై నేటికి 40 ఏళ్లు అయిన సందర్భంగా ఆయన పోస్ట్ పెట్టారు. తనను ఆదరిస్తున్న అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. అందరికీ ధన్యవాదాలు. మే 23.. నేను ఎప్పటికీ మర్చిపోలేని రోజు.. మా నాన్న చివరి చిత్రం (మనం) 2014లో ఈరోజే విడుదలైంది. నాన్నతో పాటు నాగచైతన్య, అఖిల్‌లతో నటించే అవకాశం ఆ సినిమాతోనే దక్కింది. ఇక 40 ఏళ్ల క్రితం ఇదే రోజు నా మొదటి చిత్రం 'విక్రమ్' విడుదలైంది. మిమ్మల్ని అలరించడం కోసం, మీ ప్రేమాభిమానాలు పొందడం కోసం నేను ఇండస్ట్రీకి వచ్చాను. 'విక్రమ్' నాకు ఎంతోమంది అభిమానులను దగ్గర చేసింది. ఇన్నేళ్లుగా నాకు అండగా నిలిచిన అభిమానులందరికీ నా కృతజ్ఞతలు. భవిష్యత్తులో మరిన్ని మే 23లను ఇలానే సెలబ్రేట్ చేసుకోవాలని కోరుకుంటున్నా' అని నాగార్జున తన పోస్ట్‌లో పేర్కొన్నారు. నాగార్జున హీరోగా మధుసూధనరావు తెరకెక్కించిన చిత్రం 'విక్రమ్' 1986 మే 23న విడుదలై విజయాన్ని అందుకుంది. 1983లో బాలీవుడ్‌లో విడుదలైన 'హీరో' సినిమాకు రీమేక్‌గా రూపొందింది. ప్రస్తుతం కింగ్ తన 100వ సినిమాతో బిజీగా ఉన్నారు. తమిళ దర్శకుడు రా.కార్తీక్ తెరకెక్కిస్తున్నారు. 'కింగ్ 100'అనే వర్కింగ్ టైటిల్‌తో ప్రచారంలో ఉంది. నాగార్జున ఇందులో పలు రకాల గెటప్పుల్లో కనిపిస్తారని, ఆయన పేరు చెప్పగానే శివ, రక్షకుడుతోపాటు, 'కూలీ'లో పోషించిన సైమన్ లాంటి స్టైలిష్ పాత్రలు గుర్తొస్తాయని, వాటన్నిటినీ గుర్తుచేసేలా 'కింగ్ 100' ఉంటుందని దర్శకుడు ఇటీవల తెలిపారు.

# అఖిల్ లెనిన్ టీజర్ విడుదల

## అక్కినేని అభిమానుల్లో ఉత్సాహం

అక్కినేని అఖిల్ హీరోగా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'లెనిన్'పై ప్రేక్షకుల్లో ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోంది. యువ దర్శకుడు మురళీకిశోర్ అబ్బూరు దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోంది. ఇప్పటికే సినిమా అనౌన్స్‌మెంట్‌తో మంచి అంచనాలు ఏర్పడగా, తాజాగా విడుదలైన టీజర్ సినిమాపై మరింత హైప్ తీసుకొచ్చింది. ఈ సినిమా జూన్ 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసింది. మరోవైపు అక్కినేని నాగార్జున సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టి 40 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రత్యేక సందర్భంగా, 'లెనిన్' టీజర్‌ను విడుదల చేయడం అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది. విడుదలైన టీజర్‌లో అఖిల్ స్టైలిష్ లుక్‌తో పాటు మాస్ ఎలిమెంట్స్ కూడా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఆయన చెప్పిన డైలాగులు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. మనోడు వస్తున్నాడు? నేను తప్పిపోయి రాలేదు.. మీ అందరినీ వెతుక్కుంటూ వచ్చా? అంటూ అఖిల్ చెప్పిన డైలాగులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. ఈ డైలాగుల్లో కనిపించిన యాటిట్యూడ్, స్క్రీన్ ప్రెజెన్స్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇక టీజర్ విడుదలపై నాగార్జున కూడా స్పందించారు. తనకు ఈ టీజర్ ఒక సర్‌ప్రైజ్‌లా అనిపించిందని ఆయన పేర్కొన్నారు. టీజర్ మొత్తం ఎంతో హాయిగా, ఆకట్టుకునేలా అనిపించిందని అభిప్రాయపడ్డారు. మంచి కమ్‌బ్యాక్ కోసం ఎదురుచూస్తున్న ఆయనకు 'లెనిన్' మంచి మైలురాయిగా మారుతుందా అనే ఆసక్తి అభిమానుల్లో కనిపిస్తోంది. ఇప్పటికే విడుదలైన టీజర్ చూస్తుంటే సినిమాలో యాక్షన్, భావోద్వేగాలు, మాస్ అంశాలు సమపాళ్లలో ఉండబోతున్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి. దీంతో జూన్ 26న విడుదల కానున్న ఈ సినిమాపై అక్కినేని అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.






# పెళ్లి కారణంగా అవకాశం కోల్పోయా: స్రవంతి

గ్లామర్ రంగంలో మహిళల వ్యక్తిగత జీవితం కూడా కెరీర్‌పై ప్రభావం చూపుతుందనే చర్చ మరోసారి తెరపైకి వచ్చింది. ప్రముఖ యాంకర్, బిగ్‌బాస్ ఫేమ్ స్రవంతి చొక్కారపు తాజాగా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. పెళ్లైందనే కారణంతో ఒక పెద్ద సినిమా అవకాశం కోల్పోయానని ఆమె వెల్లడించింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన స్రవంతి తన కెరీర్ ప్రారంభ రోజుల్లో ఎదురైన అనుభవాన్ని పంచుకుంది. ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలో ఒక పెద్ద ప్రాజెక్ట్ కోసం ఆడిషన్ ఇచ్చానని, నటన, రూపం పరంగా తనను ఎంపిక చేయాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నారని తెలిపింది. ఆ పాత్రకు తానే సరైన ఎంపిక అన్న సంకేతాలు కూడా వచ్చాయని చెప్పింది. అయితే చివరి దశ చర్చల సమయంలో తన వ్యక్తిగత జీవితం గురించి ప్రశ్నలు అడిగారని స్రవంతి వెల్లడించింది. "నాకు పెళ్లైందా అని అడిగారు. నేను నిజాయితీగా అవునని చెప్పాను. ఆ విషయం చెప్పిన వెంటనే పరిస్థితి మారిపోయింది" అని తెలిపింది. ముందుగా షూటింగ్ కోసం చెన్నై రావాలని, అడ్వాన్స్ కూడా ఇస్తామని చెప్పారని గుర్తుచేసుకుంది. కానీ పెళ్లి విషయం తెలిసిన తర్వాత కొద్దిసేపట్లో తిరిగి కాల్ చేస్తామని చెప్పిన వారు మళ్లీ స్పందించలేదని పేర్కొంది. చివరకు ఆ సినిమా అవకాశం తనకు రాలేదని వెల్లడించింది. తర్వాత ఆ ప్రాజెక్ట్ కూడా నిలిచిపోయిందని స్రవంతి చెప్పుకొచ్చింది. అయితే ఆ సంఘటన తనను మానసికంగా నిరాశపరిచినా, కెరీర్ విషయంలో మాత్రం వెనక్కి తగ్గలేదని తెలిపింది. కష్టపడి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నానని పేర్కొంది. స్రవంతి చొక్కారపు చిన్న యూట్యూబ్ ఛానెళ్లలో యాంకర్‌గా తన ప్రయాణాన్ని ప్రారంభించింది. అనంతరం ప్రముఖ హీరోల ఇంటర్వ్యూలతో మంచి గుర్తింపు సంపాదించుకుంది. ఒక స్టార్ హీరో సినిమా ప్రమోషన్ ఇంటర్వ్యూతో ఆమెకు భారీ సాయిలో గుర్తింపు లభించింది. తర్వాత ప్రముఖ రియాలిటీ కార్యక్రమం బిగ్‌బాస్ నాన్‌స్టాప్‌లో పాల్గొని మరింత పాపులారిటీ సంపాదించింది. ప్రస్తుతం సినిమా ఆడియో వేడుకలు, ప్రముఖుల ఇంటర్వ్యూలు, ప్రత్యేక కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తూ బిజీగా కొనసాగుతోంది. మరోవైపు నటిగానూ అవకాశాలు అందిపుచ్చుకుంటోంది. సామాజిక మాధ్యమాల్లో గ్లామరస్ ఫోటోషూట్లతో కూడా అభిమానులను ఆకట్టుకుంటోంది.

Published by Badhe Jayasree on behalf of Siri Media. Published at Flat No. 104, Kapil Kausalya Apartment, Shilpa Cereny County Vencher, Near MBR Garden, Pothireddypally X Road, Sangareddy, Telangana State - 502201. Phone : 9697889922. E-Mail : siridailynews@gmail.com.

www.siridaily.com
RNI TG TEL/ 26/A0381
# సిరి
People's Voice వార్తపత్రిక
ఆదివారం
24-05-2026
సంపుటి (Volume) : 2
సంచిక (Issue) 141
MEDAK, SANGAREDDY, SIDDIPET
పేజీలు : 5


## అక్కన్నపేటలో ఆధ్యాత్మిక ఉత్సాహం

- పండుగ వాతావరణంలో పెద్దమ్మ తల్లి వార్షికోత్సవం
- ముఖ్య అతిథిగా హాజరై, ప్రత్యేక పూజలు చేసిన మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు
- గ్రామ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా అమ్మవారి వేడుకలు
- ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించిన ముదిరాజ్ సంఘం నాయకులు, గ్రామస్తులు

4










# ఫిర్యాదు కాపీ గల్లంతు?


### అక్రమ రోడ్డు వ్యవహారంలో కొత్త అనుమానాలు

- పాటి గ్రామం రోడ్డు నిర్మాణంపై ఫిర్యాదుదారుడి ఆవేదన
- "నా వద్దకు ఫిర్యాదు రాలేదు" అన్న డీసీ
- టౌన్ ప్లానింగ్, ఇన్‌వర్డ్ సెక్షన్‌ల్లోనూ రికార్డు కనిపించలేదన్న వాదనలు
- అధికారుల వ్యవహారంపై పలు అనుమానాలు వ్యక్తం చేసిన స్థానికుడు
- ఐదు రోజులు గడిచినా చర్యలు లేవని ఆవేదన
- శుభప్రద డెవలపర్స్ వెంచర్ పరిధిలో జరుగుతున్న పనులపై అభ్యంతరాలు

3

పటాన్చెరు సర్కిల్ పరిధిలోని పాటి గ్రామంలో వివాదాస్పదంగా మారిన రోడ్డు నిర్మాణ వ్యవహారంలో కొత్త అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రోడ్డు పనులపై అధికారులకు ఫిర్యాదు చేసిన స్థానికుడు, తన ఫిర్యాదుకు సంబంధించిన రికార్డు కనిపించడంలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. గ్రామంలోని సర్వే నంబర్లు 205, 207/A, 207/AA, 207AA/3 పరిధిలో రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని ఫిర్యాదుదారు పాండు యాదవ్ తెలిపారు. సంబంధిత అనుమతులు లేకుండానే పనులు జరుగుతున్నాయనే అనుమానాలతో శుభప్రద డెవలపర్స్ వెంచర్‌పై మరోసారి అధికారులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఫిర్యాదు చేసి ఐదు రోజులు గడిచినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన తెలిపారు. ఈ విషయమై డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డిని కలవగా, "నా వద్దకు ఎలాంటి ఫిర్యాదు రాలేదు" అని సమాధానం ఇచ్చినట్లు చెప్పారు.

రామచంద్రపురం (పటాన్చెరు), మే 23 (సిరిన్యూస్)



## ప్రయాణికుల ఇబ్బందులకు చెక్!

- బస్టాండ్‌లో సులబ్ కాంప్లెక్స్ ఏర్పాటుకు చర్యలు
- స్థల పరిశీలన చేసిన అధికారులు
- సమస్యను వెలుగులోకి తీసుకొచ్చిన సిరి పత్రిక

గుమ్మడిదల, మే 23 ( సిరి న్యూస్ ): గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణంలో సులబ్ కాంప్లెక్స్ నిర్మాణానికి అధికారులు శనివారం స్థల పరిశీలన నిర్వహించారు. బస్టాండ్ పరిసరాల్లో మరుగుదొడ్ల సౌకర్యం లేక ప్రయాణికులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ అంశం ప్రాధాన్యత సంతరించుకుంది.

2



## అనాథగా అమ్మ.. శవం

- బతికున్నప్పుడు ఆదరించలేదు
- చనిపోయిన తర్వాత కూడా కన్నీటి వీడ్కోలు లేకుండానే
- చిన్నశంకరంపేటలో కలిచివేసిన ఘటన
- కుటుంబ బంధాల క్షీణతపై గ్రామస్తుల ఆవేదన

4



## లారీలు లేక ఇక్కట్లు

- కొనుగోలు కేంద్రాల్లో పేరుకు పోతున్న ధాన్యం
- రోజుల తరబడి నిల్వ.. రైతుల ఆందోళన
- వర్షం పడితే భారీ నష్టం
- ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు

2

# ప్రయాణికుల ఇబ్బందులకు చెక్!

- బస్టాండ్‌లో సులబ్ కాంప్లెక్స్ ఏర్పాటుకు చర్యలు
- స్థల పరిశీలన చేసిన అధికారులు
- సమస్యను వెలుగులోకి తీసుకొచ్చిన సిరి పత్రిక





గుమ్మడిదల, మే 23 (సిరి న్యూస్): గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణంలో సులబ్ కాంప్లెక్స్ నిర్మాణానికి అధికారులు శనివారం స్థల పరిశీలన నిర్వహించారు. బస్టాండ్ పరిసరాల్లో మరుగుదొడ్ల సౌకర్యం లేక ప్రయాణికులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ అంశం ప్రాధాన్యత సంతరించుకుంది. సర్వే నెంబర్ 198 పరిధిలోని ప్రభుత్వ భూమిలో సులబ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ మండల తహసిల్దార్ పరమేశంకు వినతి పత్రాన్ని అందజేశారు. దీనిపై స్పందించిన అధికారులు ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించి పరిస్థితులను అంచనా వేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, తహసిల్దార్ పరమేశం, మున్సిపల్ కమిషనర్ దశరథ్ కలిసి స్థలాన్ని పరిశీలించి ప్రజలకు అందుబాటులో ఉండే సౌకర్యవంతమైన ప్రదేశం, నిర్మాణానికి అనుకూలత వంటి అంశాలపై చర్చించారు. బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులకు అవసరమైన ప్రాథమిక సౌకర్యాలు కల్పించేందుకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరారు. తహసిల్దార్ పరమేశం మాట్లాడుతూ అతి త్వరలో పూర్తి స్థాయి సర్వే నిర్వహించి అనుకూలమైన ప్రభుత్వ స్థలాన్ని మున్సిపాలిటీకి అందజేయనున్నట్లు తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా అన్ని సౌకర్యాలతో సులబ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సహకరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్రాంరెడ్డి, సత్యనారాయణ, శ్రీనివాస్ రెడ్డి, హుస్సేన్, స్థానిక నాయకులు, రెవెన్యూ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రయాణికుల ఇబ్బందులను ముందే గుర్తించిన సిరి దినపత్రిక

గుమ్మడిదల బస్టాండ్ వద్ద మరుగుదొడ్ల సౌకర్యం, మూత్రశాలలు లేక పోవడం మూలాన మహిళలు, వృద్ధులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని సిరి దినపత్రిక గతంలో పలు మార్లు వెలుగులోకి తీసుకువచ్చింది. దీనిపై ప్రజల నుండి కూడా పెద్దఎత్తున స్పందన రావడంతో ప్రజా ప్రతినిధులు, అధికారులు చర్యలు ప్రారంభించడం గమనార్హం.

- కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోతున్న ధాన్యం
- రోజుల తరబడి నిల్వ.. రైతుల ఆందోళన
- వర్షం పడితే భారీ నష్టం
- ఆవేదన వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

# లారీలు లేక ఇక్కట్లు

**గుమ్మడిదల, మే 23 (సిరి న్యూస్):** వరి ధాన్యం కొనుగోళ్లు మందగించడంతో గుమ్మడిదల మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజుల తరబడి ధాన్యం నిల్వ ఉండిపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఎండలో ఆరబోసిన వడ్లు వర్షానికి తడిసి నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని రెండు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతులు పెద్దఎత్తున ధాన్యాన్ని తీసుకువచ్చి సంచుల్లో నింపి సిద్ధంగా ఉంచారు. అయితే ధాన్యాన్ని తరలించేందుకు లారీలు అందుబాటులో లేకపోవడంతో టన్నులకొద్ది వడ్లు కేంద్రాల వద్దే పేరుకుపోతున్నాయి. గత మూడు రోజులుగా ఒక్క లారీ కూడా రాకపోవడంతో పరిస్థితి మరింత దిగజారిందని రైతులు చెబుతున్నారు. ధాన్యాన్ని సంచుల్లో నింపేందుకు బీహార్ రాష్ట్రం నుంచి కూలీలను తీసుకువచ్చినా, తరలింపు లేకపోవడంతో సంచులు ఎక్కడివక్కడే నిల్వ ఉండిపోయాయి. ప్రస్తుతం వర్షాకాల పరిస్థితులు అనిశ్చితంగా ఉండటంతో ఎప్పుడైనా వర్షం కురిసే అవకాశం ఉందని, అలా జరిగితే ధాన్యం తడిసి భారీ నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను సరైన సమయంలో కొనుగోలు చేయకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు తెలిపారు. కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి వెంటనే లారీలను ఏర్పాటు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

### అధికారులకు తెలిపినా స్పందన లేదు

ధాన్యం కొనుగోలు సమస్యలను అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని గుమ్మడిదల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ నంద్యాల విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. లారీలు లేకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లో టన్నుల కొద్దీ ధాన్యం నిల్వ ఉండిపోయిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.








# ఫిర్యాదు కాపీ గల్లంతు?

## అక్రమ రోడ్డు వ్యవహారంలో కొత్త అనుమానాలు

- పాటి గ్రామం రోడ్డు నిర్మాణంపై ఫిర్యాదుదారుడి ఆవేదన
- "నా వద్దకు ఫిర్యాదు రాలేదు" అన్న డీసీ
- టౌన్ ప్లానింగ్, ఇన్‌వర్డ్ సెక్షన్‌ల్లోనూ రికార్డు కనిపించలేదన్న వాదనలు
- అధికారుల వ్యవహారంపై పలు అనుమానాలు వ్యక్తం చేసిన స్థానికుడు
- ఐదు రోజులు గడిచినా చర్యలు లేవని ఆవేదన
- శుభప్రద డెవలపర్స్ వెంచర్ పరిధిలో జరుగుతున్న పనులపై అభ్యంతరాలు

19-05-2026.

To,
The Deputy Commissioner,
Greater Hyderabad Municipal Corporation (GHMC), CMC Cir-46
Tellapur circle Office, PTC
O/o.#2-43/A,2-53, Near Water Plant,
Sangareddy Dist,
Telangana - 502032.

Subject: Representation regarding immediate stoppage of illegal road construction without any approval at Pati Village Patancheru Mandal Sangareddy District.

Respected Sir/Madam,

I, A. Pandu Yadav, respectfully submit this Representation regarding immediate intervention against the illegal and unauthorized road construction activity being carried out which is adjacent to my property situated at Sy. Nos. 205, 207/A, 207/AA & 207/AA/3, Pati Village, Patancheru Mandal, Sangareddy District.

Recently, I have given a Representation / Complaint for demolition of illegal construction and illegal encroachment and unauthorized constructions in above mentioned Sy Nos. by Mr. M. Hanumanth Reddy, K. Suresh and Ms. Subhapradha Developers, represented by Mr. G. Laxma Reddy and Mr. K. Aadireddy Komatareddy.

I submit the RTI reply the authorities stated that ON VERIFICATION OF THE PATI VILLAGE RECORDS PEMISSIONS WERE NOT FOUND AND NOT ISSUED. Now I came to know that the above mentioned person started illegal road construction without obtaining any approval from competent authorities. the developers have started laying and constructing roads in the above survey numbers without obtaining proper layout approval, road permission, or authorization from the competent authorities. The said activity is being carried out illegally and in violation of municipal laws.

The unauthorized road construction leads to Creation of unauthorized layouts, In future our society, people will face serious problems like drainage, water and road connectivity, etc and it is Violation of municipal and town planning regulations.

I Request you to stop immediately the ongoing illegal road construction work and Take strict action against the persons responsible for unauthorized construction activities.

Thank you for your attention to this matter. I am enclosing relevant documents for your kind perusal.

Yours faithfully,
A .Pandu Yadav.
8-3-228/678/5,KarmikaNagar,
Yousufguda, Hyderabad-500045.
(9391157198)

INWARD 19/05/26
INWARD 19/05/26




**రామచంద్రపురం (పటాన్చెరు), మే 23 (సిరిన్యూస్):** పటాన్చెరు సర్కిల్ పరిధిలోని పాటి గ్రామంలో వివాదాస్పదంగా మారిన రోడ్డు నిర్మాణ వ్యవహారంలో కొత్త అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రోడ్డు పనులపై అధికారులకు ఫిర్యాదు చేసిన స్థానికుడు, తన ఫిర్యాదుకు సంబంధించిన రికార్డు కనిపించడంలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. గ్రామంలోని సర్వే నంబర్లు 205, 207/A, 207/AA, 207AA/3 పరిధిలో రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని ఫిర్యాదు దారు పాండు యాదవ్ తెలిపారు. సంబంధిత అనుమతులు లేకుండానే పనులు జరుగుతున్నాయనే అనుమానాలతో శుభప్రద డెవలపర్స్ వెంచర్‌పై మరోసారి అధికారులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఫిర్యాదు చేసి ఐదు రోజులు గడిచినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన తెలిపారు. ఈ విషయమై డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డిని కలవగా, "నా వద్దకు ఎలాంటి ఫిర్యాదు రాలేదు" అని సమాధానం ఇచ్చినట్లు చెప్పారు.

డీసీ సూచనతో టౌన్ ప్లానింగ్ విభాగంలో పరిశీలించగా అక్కడ కూడా రికార్డు కనిపించలేదని, అనంతరం ఇన్‌వర్డ్ సెక్షన్‌లో చూసినా ఫిర్యాదుకు సంబంధించిన వివరాలు లభించలేదని తెలిపారు. తన వద్ద ఉన్న ఎక్నాలెడ్జ్‌మెంట్ కాపీ చూపించగా, అదే కాపీని ఫోటోకాపీ తీసి తిరిగి తనకే ఇచ్చారని, అసలు ఫిర్యాదు రికార్డు కనిపించకపోవడంపై అనుమానాలు వ్యక్తం చేశారు. మరో రెండు రోజుల్లో రోడ్డు పనులు పూర్తయ్యే అవకాశం ఉండటంతోనే ఫిర్యాదును పట్టించుకోలేదేమోనని సందేహం వ్యక్తం చేశారు. డీసీ కార్యాలయంలో రెండు గంటల పాటు వేచి పెట్టి, మొదట "ఈరోజు కలవరు.. సోమవారం రండి" అని చెప్పారని, తాను దూరం నుంచి వచ్చానని వివరించిన తర్వాతే లోపలికి పంపించారని తెలిపారు. చివరకు "మీ ఫిర్యాదు నా వద్దకు రాలేదు" అనే సమాధానం రావడంతో అధికారుల వ్యవహారంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు దారు కోరుతున్నారు.







# అక్కన్నపేటలో ఆధ్యాత్మిక ఉత్సాహం

- పండుగ వాతావరణంలో పెద్దమ్మ తల్లి వార్షికోత్సవం
- ముఖ్య అతిథిగా హాజరై, ప్రత్యేక పూజలు చేసిన మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు
- గ్రామ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా అమ్మవారి వేడుకలు
- ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించిన ముదిరాజ్ సంఘం నాయకులు, గ్రామస్తులు

**రామాయంపేట, మే 23 (సిరి న్యూస్)**

రామాయంపేట మండలంలోనీ అక్కన్నపేట గ్రామంలో శనివారం నాడు పెద్దమ్మ తల్లి 17వ వార్షికోత్సవం వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శ్రీ పెద్దమ్మ తల్లి 17వ వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. గ్రామ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాలకు నియోజకవర్గ శాసనసభ్యులు (ఎమ్మెల్యే) రోహిత్ ముఖ్య అతిథిగా హాజరై, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం సమయంలో ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే రోహిత్‌కు ముదిరాజ్ సంఘం నాయకులు, యువకులు, గ్రామస్తులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రధాన కార్యదర్శి సుభాష్ చంద్రబోస్ తో పాటు యువకులు ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల అనంతరం, గ్రామ ముదిరాజ్ సంఘం నాయకులు ఎమ్మెల్యే రోహిత్‌ను శాలువా కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. గ్రామాభివృద్ధికి, ముదిరాజ్ సంఘ సంక్షేమానికి ఆయన ఎల్లప్పుడూ అండగా ఉంటారని ఈ సందర్భంగా నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. పెద్దమ్మ తల్లి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అక్కన్నపేట గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం ముఖ్య నాయకులు, నిర్వాహకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట మున్సిపల్ కౌన్సిలర్ లు గజవాడ నాగరాజు గుప్తా, దేవుని రంజిత్, కోఆప్షన్ సభ్యుడు గౌస్, సర్పంచ్ మానేగళ్ళ రామ కిష్టయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగులు, చింతల యాదగిరి, చింతల స్వామి, పోచమ్మల గణేష్, యాదగిరి, నమోండ్ల సందీప్, బాసం విజయ్, ప్రభాకర్ తో పాటు పలువురు పాల్గొన్నారు.



# అనాథగా అమ్మ.. శవం

**బతికున్నప్పుడు ఆదరించలేదు**
**చనిపోయిన తర్వాత కూడా కన్నీటి వీడ్కోలు లేకుండానే**
**చిన్నశంకరంపేటలో కలిచివేసిన ఘటన**
**కుటుంబ బంధాల క్షీణతపై గ్రామస్తుల ఆవేదన**

**మెదక్ ప్రతినిధి,మే23(సిరి న్యూస్)** మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలంలోని ఓ గ్రామంలో చోటు చేసుకున్న హృదయ విదారక ఘటన స్థానికులను తీవ్రంగా కలచివేసింది. జీవితాంతం కుటుంబ సభ్యుల కోసం కష్టపడిన ఓ వృద్ధ మహిళ చివరకు అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె మృతదేహాన్ని స్వీకరించేందుకు కుటుంబ సభ్యులు ముందుకు రాకపోవడం గ్రామంలో తీవ్ర చర్చనీయాంశమైంది. చివరికి గ్రామ పెద్దలు, సానిక ప్రజలే ముందుకు వచ్చి అంత్యక్రియల ఏర్పాట్లు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఈ విషాద ఘటన చిన్న శంకరంపేట మండలం భగీర్తి పల్లి లో చోటుచేసుకుంది.గ్రామస్తుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రెడ్డి చంద్రమ్మ అనే వృద్ధ మహిళ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఒంటరిగా జీవిస్తోంది. కుటుంబ కలహాలు, ఆస్తి వివాదాలు కారణంగా బంధువులు ఆమెను దూరం పెట్టినట్లు స్థానికులు చెబుతున్నారు. ఆరోగ్యం క్షీణించినప్పటికీ చూసుకునే వారు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలుస్తోంది. చివరకు ఆమె మృతి చెందగా సమాచారం అందించినా కుటుంబ సభ్యుల నుంచి స్పందన లేకపోవడం అందరినీ కలచివేసింది.వృద్ధురాలి మృతదేహం ఇంటి ముందే ఉండగా గ్రామ ప్రజలు అక్కడికి చేరుకుని పరిస్థితిని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. "బతికున్నప్పుడు ఆదరించలేదు.. చనిపోయిన తర్వాత కూడా చివరి చూపు చూడలేదా?" అంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. మృతదేహాన్ని అలాగే వదిలేయకుండా గ్రామ పెద్దలు, యువకులు కలిసి అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు. కొందరు మహిళలు పూలు తీసుకువచ్చి నివాళులర్పించగా, గ్రామంలో విషాద వాతావరణం నెల కొంది.ఈ ఘటనతో గ్రామంలో కుటుంబ విలువలు, బంధుత్వాలపై చర్చ మొదలైంది. "ఇప్పటి సమాజంలో మానవత్వం కంటే డబ్బు, ఆస్తులకే ప్రాధాన్యం పెరిగిం ది" అంటూ పలువురు మండిపడ్డారు. వృద్ధుల ను ఆదరించాల్సిన కుటుంబ సభ్యులే నిర్లక్ష్యం చేయడం బాధాకరమని గ్రామ పెద్దలు అభిప్రాయపడ్డారు. గ్రామస్తులు ఈ ఘటనపై అధికారుల దృష్టి సారించాలని కోరుతున్నారు. ఒంటరిగా జీవిస్తున్న వృద్ధులకు ప్రభుత్వం ప్రత్యేక సహాయం అందించాలని, గ్రామస్థాయిలో వృద్ధు ల సంక్షేమంపై పర్యవేక్షణ పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.వృద్ధురాలి మృతదేహం ఇంటి ముందు ఉండగా చుట్టూ చేరిన గ్రామస్తులు, కుటుంబ సభ్యుల మధ్య జరిగిన వాగ్వాదాలు గ్రామాన్ని కలచివేశాయి. కన్నీటి మధ్య గ్రామస్తులే ఆమెకు తుదివీడ్కోలు పలకడం భావోద్వేగానికి గురి చేసింది. "అమ్మకు చివరికి గ్రామమే కుటుంబమైంది" అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.